# తెలంగాణ ముచ్చట్లు

TELANGANA MUCHATLU

TELTEL/2023/88710

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్

తెలుగు దిన పత్రిక

వరంగల్ | బుధవారం - 01- జూలై 2026 | సంపుటి : 4 | సంచిక : 27 | పేజీలు - 8 | వెల : రూ 7 | www.telanganamuchatlu.in




## అంబులెన్స్‌లు, ఎంఆర్ఐ స్కానర్ ప్రారంభం

- మహిళా సంఘాలకు రుణాలు పెంచాలని సీఎం సూచన
- సీఎస్ఆర్ భాగస్వామ్యాన్ని అభినందించిన ప్రభుత్వం

హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి మంగళవారం ప్రారంభించారు. ఎంసీఆర్ హెచ్ఆర్‌డీలో నిర్వహించిన కార్యక్రమంలో రెండు అంబులెన్స్‌లను జెండా ఊపి ప్రారంభించడంతో పాటు భూపాలపల్లి ప్రభుత్వ ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఎంఆర్ఐ స్కానర్‌ను వర్చువల్‌గా ప్రారంభించారు.

ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధులను ప్రజలకు ఉపయోగపడే ఆరోగ్య, మౌలిక సదుపాయాల అభివృద్ధికి వినియోగించడం అభినందనీయమన్నారు. ప్రభుత్వంతో కలిసి ప్రైవేట్ సంస్థలు సామాజిక అభివృద్ధిలో భాగస్వాములు కావడం వల్ల ప్రజలకు మెరుగైన సేవలు అందుతాయని పేర్కొన్నారు. స్వయం సహాయక మహిళా సంఘాలు తీసుకున్న రుణాలను సక్రమంగా చెల్లిస్తున్నాయని ముఖ్యమంత్రి తెలిపారు. ఈ నేపథ్యంలో మహిళా సంఘాలకు బ్యాంకులు మరింత విస్తృతంగా రుణాలు మంజూరు చేయాలని హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ప్రతినిధులను కోరారు. మహిళల ఆర్థిక సాధికారతకు బ్యాంకుల సహకారం కీలకమని అన్నారు.

రాష్ట్ర ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో లాజిస్టిక్ పార్కులు, గోదాములు, రైస్ మిల్లులు వంటి ఉపాధి కల్పించే ప్రాజెక్టులను చేపడుతోందని ముఖ్యమంత్రి వివరించారు. ఈ కార్యక్రమాల విజయవంతమైన అమలుకు


మిగతా 2లో

## యాదగిరిగుట్ట అభివృద్ధికి కొత్త విధానాలు

- భూముల కేటాయింపునకు స్పష్టమైన పాలసీ
- టీటీడీ విధానాల అధ్యయనానికి ఆదేశం
- ఆలయ అభివృద్ధి పనులకు నిధుల మంజూరు
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి


హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు): యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం పరిధిలో వివిధ మఠాలు, ధార్మిక సంస్థలకు భూముల కేటాయింపునకు స్పష్టమైన విధానం రూపొందించాలని

మిగతా 2లో



## ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ కొత్త కేంద్రం

- వరంగల్, ఆదిలాబాద్ విమానాశ్రయాలకు శ్రీకారం
- కొత్తగూడెం విమానాశ్రయానికి త్వరలో ఆమోదం
- ప్రపంచ కంపెనీలకు ఉత్తమ్ ఆహ్వానం



హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణను దేశంలోనే అగ్రగామి ఏరోస్పేస్, రక్షణ ఉత్పత్తుల తయారీ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌లో నిర్వహించిన 'ఏరోమార్ట్ హైదరాబాద్-2026' సదస్సులో ప్రారంభోపన్యాసం చేసిన ఆయన, వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో కొత్త విమానాశ్రయాల అభివృద్ధికి ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసిందని వెల్లడించారు. ప్రపంచ ఏరోస్పేస్ సంస్థలు తెలంగాణలో తమ తయారీ కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆహ్వానించారు. మంత్రి మాట్లాడుతూ

మిగతా 2లో

## రూ.2.10 కోట్లతో బీటీ రహదారికి శంకుస్థాపన

- రాజులతండాలో పనులకు శ్రీకారం
- తండాల అభివృద్ధికి రహదారులే కీలకం
- ఓటరు జాబితా సవరణపై అధికారులకు ఆదేశాలు



సిద్దిపేట, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):

హుస్నాబాద్ నియోజకవర్గంలోని అక్కన్నపేట మండలం దుబ్బతండా గ్రామ పంచాయతీ పరిధిలోని రాజులతండాలో రూ.2.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రహదారి పనులకు రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మంగళవారం శంకుస్థాపన చేశారు. పంజాగుట్ట తండా నుంచి రాజ్ తండా వరకు నిర్మించనున్న ఈ రహదారి తండాల అభివృద్ధికి దోహదపడుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ తండాల అభివృద్ధిలో రహదారి సౌకర్యాలు అత్యంత కీలకమని అన్నారు.

మిగతా 2లో

## తెలంగాణ కొత్త ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

- బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు
- పదవీ విరమణ చేసిన రామకృష్ణారావు
- అధికారులు ఘనంగా అభినందనలు

హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు): తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శిగా సీనియర్ ఐఏఎస్ అధికారి సంజయ్ జాజు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ తెలంగాణ సచివాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన అధికారికంగా పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రభుత్వ ఉన్నతాధికారులు, వివిధ శాఖల కార్యదర్శులు, సచివాలయ అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.

మిగతా 2లో





## ప్రత్యేక బెటాలియన్ల బలోపేతంపై డీజీపీ సమీక్ష

- ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం
- సిబ్బంది సంక్షేమం, శిక్షణపై దృష్టి
- కొత్త బెటాలియన్ల ఏర్పాటుపై పరిశీలన

హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):

తెలంగాణ డీజీపీ సి.వి. ఆనంద్ మంగళవారం హైదరాబాద్‌లో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల పనితీరుపై సమీక్ష నిర్వహించారు. బలగాలను ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో మరింత బలోపేతం చేయడంతో పాటు సిబ్బంది సంక్షేమం, నాణ్యమైన శిక్షణ, పారదర్శక పరిపాలనకు అత్యధిక ప్రాధాన్యం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా పోలీసు బలగాలు సాంకేతికంగా మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఆధునిక పరికరాలు, సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించాలని సూచించారు.

మిగతా 2లో

## కాంగ్రెస్ హామీలపై బీజేపీ విమర్శలు

- రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో నితిన్ నబీన్
- ఆరు గ్యారంటీల అమలుపై ప్రశ్నలు
- గ్రామస్థాయిలో పార్టీని బలోపేతం చేయాలని పిలుపు

హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):

భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సమావేశానికి పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరుపై విమర్శలు చేస్తూ, పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. రానున్న రోజుల్లో ప్రజా సమస్యలపై

మిగతా 2లో



తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# సీఎంను కలిసిన కొత్త ప్రధాన కార్యదర్శి

- రేవంత్ రెడ్డితో సంజయ్ జాజు భేటీ
- బోధి పావిలియన్‌లో మర్యాదపూర్వక సమావేశం

హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):



తెలంగాణ నూతన ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన సంజయ్ జాజు మంగళవారం ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఎంసీఆర్ హెచ్ఆర్డీ ఇన్‌స్టిట్యూట్‌లోని బోధి పావిలియన్‌లో జరిగిన ఈ సమావేశంలో రాష్ట్ర పరిపాలనకు సంబంధించిన పలు అంశాలపై చర్చించినట్లు తెలిసింది. ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన అనంతరం ముఖ్యమంత్రిని కలిసిన సంజయ్ జాజుకు సీఎం అభినందనలు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో సమర్థవంతమైన పరిపాలన అందించాలని ఆకాంక్షించినట్లు సమాచారం. ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలను వేగవంతంగా అమలు చేయడంపై కూడా చర్చ జరిగినట్లు తెలిసింది.

ఈ సమావేశానికి పదవీ విరమణ చేసిన మాజీ ప్రధాన కార్యదర్శి, ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారు, ముఖ్యమంత్రి ఎక్స్ అఫిషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన కె. రామకృష్ణారావు కూడా హాజరయ్యారు. కొత్త బాధ్యతలు చేపట్టిన సంజయ్ జాజుకు ఆయన శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్ర పరిపాలనలో ప్రధాన కార్యదర్శి కీలక బాధ్యతలు నిర్వహిస్తారని, ప్రభుత్వ విధానాల అమలు, శాఖల సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో ఆయన పాత్ర అత్యంత ముఖ్యమని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో సీఎంతో జరిగిన భేటీకి ప్రాధాన్యం ఏర్పడింది.

సంజయ్ జాజు 1992 బ్యాచ్‌కు చెందిన సీనియర్ ఐఏఎస్ అధికారి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల్లో వివిధ కీలక బాధ్యతలు నిర్వహించిన అనుభవం ఆయనకు ఉంది. పరిపాలనా అనుభవంతో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమాల అమలు మరింత వేగవంతం అవుతుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది. రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలుకు పూర్తి స్థాయిలో కృషి చేయాలని ముఖ్యమంత్రి సూచించినట్లు సమాచారం. ప్రభుత్వం నిర్దేశించిన ప్రాధాన్య కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు పరిపాలనా యంత్రాంగం పనిచేయనుందని అధికారులు తెలిపారు.

# యాదగిరిగుట్ట అభివృద్ధికి కొత్త విధానాలు

(మొదటి పేజీ తరువాయి)

ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దేవస్థానం భూముల యాజమాన్య హక్కులు పూర్తిగా ఆలయానికే ఉండేలా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. మంగళవారం ఎంసీఆర్ హెచ్ఆర్డీ బోధి పెవిలియన్‌లో ఆలయ అభివృద్ధిపై నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్ష సమావేశంలో ఈ మేరకు పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. భూముల కేటాయింపులో తిరుమల తిరుపతి దేవస్థానం అమలు చేస్తున్న విధానాన్ని సమగ్రంగా అధ్యయనం చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. యాదగిరిగుట్టలో హరే రామ హరే కృష్ణ చారిటబుల్ ఫౌండేషన్‌కు మార్కెట్ ధర ప్రకారం భూమిని కేటాయించే అంశాన్ని పరిశీలించాలని అధికారులకు ఆదేశించారు. భవిష్యత్‌లో భూముల కేటాయింపులో పారదర్శకత, ఏకరీతి విధానాన్ని అమలు చేయాలని సూచించారు.




గుట్టపై అతిథి గృహాల నిర్మాణానికి ముందుకు వచ్చే దాతలు, సంస్థల జాబితాను సిద్ధం చేయాలని సీఎం ఆదేశించారు. అతిథి గృహాల నిర్మాణంలో కూడా టీటీడీ విధానాన్ని అనుసరించి దశలవారీగా అనుమతులు మంజూరు చేయాలని సూచించారు. కుల సంఘాలకు స్థలాల కేటాయింపుపైనా స్పష్టమైన నిబంధనలతో కూడిన విధానాన్ని రూపొందించాలని చెప్పారు. ఆలయ పరిధిలో చేపట్టనున్న వివిధ అభివృద్ధి పనుల కోసం అవసరమైన భూ సేకరణకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఆలయ నిర్మాణానికి సంబంధించి ఇంజనీర్ల కమిటీ సమర్పించిన నివేదికను సమగ్రంగా పరిశీలించి వారంలోగా తుది నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతకు అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు.

యాదగిరిగుట్టను ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రంగా మరింత అభివృద్ధి చేయడానికి ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్య విధానంలో పర్యాటక సర్క్యూట్‌ను అభివృద్ధి చేయాలని ముఖ్యమంత్రి సూచించారు. భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడంతో పాటు పర్యాటకులను ఆకర్షించే విధంగా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని అధికారులకు ఆదేశించారు. ఈ సమావేశంలో రాజ్యసభ సభ్యుడు వేమ్ నరేందర్ రెడ్డి, ఎంపీలు కిరణ్ చామల, రఘువీర్, ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య, ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి, దేవాదాయ, ఆర్థిక శాఖ అధికారులు, శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం అధికారులు పాల్గొన్నారు. యాదగిరిగుట్టను దేశంలో ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతుందని సమావేశంలో వెల్లడించారు.

# ఏరోస్పేస్ రంగానికి తెలంగాణ కొత్త కేంద్రం

వరంగల్ విమానాశ్రయానికి వచ్చే నెలలో శంకుస్థాపన చేసే అవకాశం ఉందన్నారు. ఆదిలాబాద్‌లో పౌర, సైనిక విమానయాన అవసరాలకు అనువుగా కొత్త విమానాశ్రయం అభివృద్ధి చేస్తామని తెలిపారు. కొత్తగూడెంలో మరో విమానాశ్రయం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చలు కొనసాగుతున్నాయని, త్వరలోనే తుది అనుమతి లభించే అవకాశం ఉందని వెల్లడించారు. ఈ మూడు విమానాశ్రయాలు రాష్ట్రంలో విమానయాన, పారిశ్రామిక రంగాలకు కొత్త ఊపునిస్తాయని పేర్కొన్నారు.

తాను భారత వైమానిక దళంలో యుద్ధ విమాన పైలట్‌గా పనిచేసిన అనుభవంతో ఏరోస్పేస్ రంగం ప్రాముఖ్యతను బాగా అర్థం చేసుకున్నానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. అత్యంత కచ్చితత్వం, నాణ్యతకు ఈ రంగంలో అత్యంత ప్రాధాన్యం ఉంటుందని చెప్పారు. తెలంగాణలో ప్రస్తుతం అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్, స్పెయిన్, ఇటలీ, జపాన్, ఇజ్రాయెల్, కెనడా వంటి దేశాలకు చెందిన ప్రముఖ సంస్థలు పెట్టుబడులు పెట్టి ప్రపంచ స్థాయి ఉత్పత్తులను తయారు చేస్తున్నాయని వివరించారు. హైదరాబాద్‌లో ఇప్పటికే అమెరికా అధ్యక్షుడి హెలికాప్టర్ క్యాబిన్లు, అపాచీ హెలికాప్టర్ భాగాలు, ఎఫ్16 యుద్ధ విమాన రెక్కలు, అత్యాధునిక విమాన ఇంజిన్ భాగాలు తయారవుతున్నాయని మంత్రి తెలిపారు. స్పెయిన్‌కు చెందిన ఐటీపీ ఏరో, కెనడాకు చెందిన ఎఫ్‌టీజీ ఏరోస్పేస్ వంటి అంతర్జాతీయ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టడం రాష్ట్రానికి పెరుగుతున్న విశ్వసనీయతకు నిదర్శనమని పేర్కొన్నారు. రాష్ట్రంలో ప్రత్యేక ఏరోస్పేస్ పారిశ్రామిక మండలాలు, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, బలమైన సూక్ష్మ, చిన్న, మధ్యతరహా పరిశ్రమల వ్యవస్థ అందుబాటులో ఉందన్నారు.



ఏరోస్పేస్, రక్షణ రంగంలో తెలంగాణ గత కొన్నేళ్లుగా దాదాపు 30 శాతం వార్షిక వృద్ధిని నమోదు చేసిందని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. గత ఏడాది ఈ రంగానికి చెందిన ఎగుమతులు 103 శాతం పెరిగి తొలిసారిగా ఔషధ రంగ ఎగుమతులను అధిగమించాయని వెల్లడించారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ, ఆధునిక సాంకేతిక శిక్షణ కేంద్రాల ద్వారా పరిశ్రమలకు అవసరమైన నైపుణ్య సిబ్బందిని ప్రభుత్వం తయారు చేస్తోందని వివరించారు. ప్రపంచ ఏరోస్పేస్ సంస్థలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టేందుకు ఇదే సరైన సమయమని మంత్రి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం పెట్టుబడిదారులకు అవసరమైన అన్ని రకాల సహకారం అందిస్తుందని, ప్రజాప్రతినిధులు నుంచి అధికార యంత్రాంగం వరకు పరిశ్రమలకు పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. తెలంగాణ పరిశ్రమలు అంతర్జాతీయ సరఫరా వ్యవస్థలో మరింత కీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

# అంబులెన్స్‌లు, ఎంఆర్ఐ స్కానర్ ప్రారంభం

(మొదటి పేజీ తరువాయి)

అవసరమైన ఆర్థిక సహకారం అందించాలని బ్యాంకు ప్రతినిధులను విజ్ఞప్తి చేశారు. హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు చేపట్టిన సీఎస్ఆర్ కార్యక్రమాలు ఆరోగ్య రంగానికి మరింత బలం చేకూరుస్తాయని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. ప్రభుత్వంతో కలిసి ప్రజా సంక్షేమ కార్యక్రమాల్లో బ్యాంకులు మరింత చురుకుగా భాగస్వామ్యం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, తెలంగాణ ప్రభుత్వ నూతన ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు ఉన్నతాధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. ప్రభుత్వ-ప్రైవేటు భాగస్వామ్యంతో రాష్ట్ర అభివృద్ధిని మరింత వేగవంతం చేయాలని సమావేశంలో ఆకాంక్షించారు.

# రూ.2.10 కోట్లతో బీటీ రహదారికి శంకుస్థాపన

(మొదటి పేజీ తరువాయి)

గ్రామీణ ప్రాంతాల్లో మెరుగైన రవాణా సదుపాయాలు కల్పించడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని తెలిపారు. ప్రభుత్వం గ్రామీణ మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని చెప్పారు. ఈ రహదారి నిర్మాణంతో ప్రజల రాకపోకలు సులభతరం కావడంతో పాటు విద్య, వైద్యం, వ్యవసాయ అవసరాలకు కూడా ఎంతో ఉపయోగపడుతుందని మంత్రి వివరించారు. రైతులు తమ వ్యవసాయ ఉత్పత్తులను మార్కెట్లకు సులభంగా తరలించేందుకు ఈ రహదారి దోహదం చేస్తుందని పేర్కొన్నారు. స్థానిక ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు.



రహదారి నిర్మాణ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా చేపట్టాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశించారు. నిర్ణీత గడువులోగా పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. నిర్మాణంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావు లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని చెప్పారు. అనంతరం ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ఇంటింటికీ వెళ్లి సర్వే నిర్వహించాలని సూచించారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాలను పాటిస్తూ పారదర్శకంగా ప్రక్రియ పూర్తి చేయాలని అధికారులకు ఆదేశించారు. ప్రజాస్వామ్యంలో ప్రతి అర్హుడి ఓటు హక్కు అత్యంత విలువైనదని మంత్రి పేర్కొన్నారు. అర్హులైన ఒక్క ఓటరు కూడా జాబితాకు దూరం కాకుండా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎన్నికల ప్రక్రియను కూడా సమర్థవంతంగా నిర్వహించడం ప్రభుత్వ బాధ్యత అని ఆయన అన్నారు.

# తెలంగాణ కొత్త ప్రధాన కార్యదర్శిగా సంజయ్ జాజు

(మొదటి పేజీ తరువాయి)

1992 బ్యాచ్‌కు చెందిన ఐఏఎస్ అధికారి సంజయ్ జాజును రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా నియమిస్తూ ప్రభుత్వం ఈ నెల 26న ఉత్తర్వులు జారీ చేసింది. పదవీ విరమణ చేసిన కె. రామకృష్ణారావు స్థానంలో ఆయన బాధ్యతలు చేపట్టారు. పరిపాలనలో విస్తృత అనుభవం కలిగిన అధికారిగా సంజయ్ జాజుకు గుర్తింపు ఉంది.

బాధ్యతల స్వీకరణ సందర్భంగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ప్రధాన కార్యదర్శులు, ప్రభుత్వ కార్యదర్శులు, శాఖాధిపతులు, సచివాలయ అధికారులు, సిబ్బంది సంజయ్ జాజుకు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు. రాష్ట్ర పరిపాలనను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. అదే కార్యక్రమంలో పదవీ విరమణ చేసిన మాజీ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావుకు అధికారులు ఘనంగా వీడ్కోలు పలికారు. ప్రభుత్వ సేవల్లో ఆయన అందించిన సేవలను కొనియాడుతూ పుష్పగుచ్ఛాలు అందజేసి సత్కరించారు. వివిధ శాఖల అధికారులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

రాష్ట్ర పరిపాలనలో ప్రధాన కార్యదర్శి పదవి కీలకమైనదిగా భావిస్తారు. ప్రభుత్వ విధానాల అమలు, శాఖల మధ్య సమన్వయం, అభివృద్ధి కార్యక్రమాల పర్యవేక్షణలో ప్రధాన కార్యదర్శి ముఖ్య భూమిక పోషిస్తారు. ఈ నేపథ్యంలో సంజయ్ జాజు బాధ్యతల స్వీకరణకు ప్రాధాన్యం ఏర్పడింది. కొత్త ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వ పరిపాలన మరింత సమర్థవంతంగా సాగుతుందని అధికారులు ఆశాభావం వ్యక్తం చేశారు. ప్రజా సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాల అమలు, పరిపాలనా సంస్కరణలకు ప్రాధాన్యం ఇస్తూ ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను సాధించే దిశగా ముందుకు సాగనున్నట్లు అధికార వర్గాలు పేర్కొన్నాయి.



# ప్రత్యేక బెటాలియన్ల బలోపేతంపై డీజీపీ సమీక్ష

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బంది సంక్షేమం, వారి మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డీజీపీ పేర్కొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని తగ్గించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని, సిబ్బందికి క్రమం తప్పకుండా శిక్షణా కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. డ్రగ్స్, ఆన్‌లైన్ బెట్టింగ్ వంటి సామాజిక సమస్యలను అరికట్టేందుకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని డీజీపీ సూచించారు. ఈ నేరాల నియంత్రణలో స్పెషల్ బెటాలియన్లు మరింత చురుకైన పాత్ర పోషించాలని, ప్రజల్లో అవగాహన పెంచే కార్యక్రమాలు కూడా నిర్వహించాలని తెలిపారు.




భవిష్యత్ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఫ్యూచర్ సిటీ, ఆమనగల్ ప్రాంతాల్లో కొత్త స్పెషల్ బెటాలియన్ల ఏర్పాటును ప్రభుత్వం పరిశీలిస్తున్నట్లు డీజీపీ వెల్లడించారు. పెరుగుతున్న అవసరాలకు అనుగుణంగా పోలీసు బలగాల విస్తరణకు చర్యలు చేపడుతున్నామని చెప్పారు. సమావేశంలో తెలంగాణ స్పెషల్ బెటాలియన్ల ఉన్నతాధికారులు పాల్గొని వివిధ అంశాలపై డీజీపీకి వివరించారు. బలగాల సామర్థ్యాన్ని మరింత పెంచి ప్రజలకు మెరుగైన భద్రత అందించేందుకు అన్ని విభాగాలు సమన్వయంతో పనిచేయాలని డీజీపీ సూచించారు.

# కాంగ్రెస్ హామీలపై బీజేపీ విమర్శలు

(మొదటి పేజీ తరువాయి)


పోరాటాన్ని మరింత ఉద్ధృతం చేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాట్లాడిన నితిన్ నబీన్, ఆరు గ్యారంటీలతో పాటు అనేక హామీలు ఇచ్చి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని, అయితే వాటిలో ఒక్క హామీని కూడా ప్రజలు ఆశించిన స్థాయిలో అమలు చేయలేకపోయిందని విమర్శించారు. నిరుద్యోగ భృతి, మహిళలకు ఆర్థిక సహాయం వంటి అంశాల్లో ప్రభుత్వం ప్రజలకు స్పష్టమైన సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉందని ఆరోపించారు.




తెలంగాణ ప్రజలకు సేవ చేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ఢిల్లీలోని కాంగ్రెస్ పార్టీకి ఏటీఎంగా మార్చిందని నితిన్ నబీన్ వ్యాఖ్యానించారు. ప్రజల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా ఉండి ఉంటే ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల ప్రయోజనాలు ఇప్పటికే ప్రతి ఇంటికీ చేరేవని అన్నారు. ప్రజల్లో పెరుగుతున్న అసంతృప్తిని బీజేపీ ప్రజా ఉద్యమాల ద్వారా వెలుగులోకి తీసుకువస్తుందని చెప్పారు. రాష్ట్రంలో రైతులు, మహిళలు, యువత, నిరుద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించి ప్రత్యామ్నాయంగా బీజేపీ విధానాలను చేర్చాలని పిలుపునిచ్చారు. ప్రజలతో నిరంతరం మమేకమై పార్టీని మరింత బలోపేతం చేయాలని కోరారు.

రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ పోరాటాన్ని మరింత విస్తృతం చేస్తామని నితిన్ నబీన్ తెలిపారు. పార్టీ సందేశాన్ని ప్రతి గ్రామానికి, ప్రతి ఇంటికి చేర్చేలా కార్యాచరణ రూపొందించాలని నాయకులకు సూచించారు. బూత్ స్థాయి నుంచి పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేయడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర బీజేపీ నాయకులు, ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, జిల్లా అధ్యక్షులు, వివిధ అనుబంధ విభాగాల ప్రతినిధులు పాల్గొన్నారు. పార్టీ బలోపేతం, భవిష్యత్ కార్యాచరణ, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై విస్తృతంగా చర్చించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.


తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
బుధవారం - 01 - జూలై 2026

# ప్రజల కష్టకాలంలో అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

- **హుజూరాబాద్‌లో భారీగా సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ**

**హుజూరాబాద్, జూన్ 30(తెలంగాణ ముచ్చట్లు ):** ఆర్థిక ఇబ్బందులతో వైద్య చికిత్సలు, అత్యవసర అవసరాల కోసం ఇబ్బంది పడుతున్న నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయ నిధి (సి ఎం ఆర్ ఫ్ )ద్వారా ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం ఎంతో ఊరటనిస్తోందని కాంగ్రెస్ పార్టీ నాయకులు పేర్కొన్నారు. హుజూరాబాద్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇంచార్జ్ వొడితల ప్రణవ్ బాబు, హుజూరాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి రొంటాల సుహాసిని మనోజ్ రావు ఆధ్వర్యంలో సీఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు సీఎం సహాయ నిధి చెక్కులను అందజేసిన నాయకులు, ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పేద ప్రజలు ఆర్థిక ఇబ్బందుల వల్ల వైద్య చికిత్సలకు దూరం కాకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా వేగంగా ఆర్థిక సహాయం అందిస్తున్నట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తున్నామని అన్నారు. ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపించడం తమ బాధ్యతగా భావిస్తున్నామని, నియోజకవర్గ అభివృద్ధితో పాటు ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా పనిచేస్తామని వొడితల ప్రణవ్ బాబు తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రొంటాల సుహాసిని మనోజ్ రావు మాట్లాడుతూ, ప్రజలకు అవసరమైన ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ అండగా నిలుస్తుందని, ప్రజా సేవే తమ ధ్యేయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ టౌన్ అధ్యక్షులు, మండల అధ్యక్షులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, మహిళా కాంగ్రెస్ నాయకురాళ్లు, సర్పంచులు, వార్డు సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, లబ్ధిదారులు, నియోజకవర్గ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది.





# వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతాం...

**రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి**

**ఖమ్మం, బ్యూరో , జూన్- 30(తెలంగాణ ముచ్చట్లు ):** రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండగలా తీర్చిదిద్దుతామని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి అన్నారు. మంగళవారం హైదరాబాద్ లోని శిల్పకళా వేదిక నుండి రైతు భరోసా లో భాగంగా ఏర్పాటు చేసిన రైతు భరోసా నిధుల విడుదల కార్యక్రమానికి హాజరై, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వర రావు, ఉత్తంకుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస రెడ్డి, వాకాటి శ్రీహరి, రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలోని రైతు వేదికల ద్వారా జూపల్లి కృష్ణారావు, పొన్నం ప్రభాకర్, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి రైతు భరోసా నిధులను విడుదల చేశారు. ఇట్టి కార్యక్రమాన్ని వర్చువల్ విధానంలో రాష్ట్రంలోని అన్ని రైతు వేదికల్లో ప్రత్యక్ష ప్రసారం చేయగా, చింతకాని మండలం నాగులవంచ గ్రామంలోని రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, అధికారులు, రైతులతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి మాట్లాడుతూ, ప్రజా పాలన ప్రభుత్వంలో రైతు సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తున్నామని, రాష్ట్రంలో వ్యవసాయం అంటే పండుగలా నిర్వహిస్తున్నామని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో తీసుకున్న అనాలోచిత నిర్ణయాల కారణంగా రాష్ట్రంలో ఏర్పడిన పరిస్థితులను ఒక్కొక్కటిగా సరి చేసుకుంటూ వస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ అధికారులు, ఉద్యోగులకు ప్రతి నెల 1వ తేదీన వేతనాలు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. 2 లక్షల రూపాయల రైతు రుణమాఫీ లో భాగంగా 25 లక్షల 35 వేల మంది రైతులకు 20 వేల 677 ఓట్ల రూపాయలు రుణమాఫీ చేయడం జరిగిందని, రైతు భరోసాలో భాగంగా సంవత్సరానికి ఎకరానికి 12 వేల రూపాయల పెట్టుబడి సాయం అందించడం జరుగుతుందని తెలిపారు. ఇప్పటివరకు 27 వేల కోట్ల రూపాయల రైతు భరోసా రైతుల ఖాతాలలో జమ చేయడం జరిగిందని, ప్రస్తుతం 9 వేల కోట్ల రూపాయలు చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని, మొత్తంగా 36 వేల కోట్ల రూపాయలు రైతు భరోసా కొరకు ఖర్చు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని వ్యవసాయ రంగంలో విద్యుత్ వినియోగానికి 30 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని, 4 వేల కోట్ల రూపాయల బోనస్, 2 వేల కోట్ల రూపాయలతో పనిముట్లు, రైతు భీమా పథకం కొరకు 3 వేల 500 కోట్ల రూపాయలు ఖర్చు చేయడం జరిగిందని తెలిపారు. పౌర సరఫరాల సంస్థ ద్వారా రైతుల వద్ద నుండి 2 లక్షల 88 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసి 80 వేల కోట్ల రూపాయలు సంబంధిత రైతుల ఖాతాలలో జమ చేశామని తెలిపారు. ఇప్పటివరకు మొత్తం 1 లక్ష 75 వేల కోట్ల రూపాయలు వ్యవసాయ రంగం కోసం ఖర్చు చేయడం జరిగిందని, సరాసరి ప్రతి నెల 6 వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామని తెలిపారు. నష్టాలలో ఉన్న రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థను 1 వేయి కోట్ల లాభాల లోకి తీసుకురావడం జరిగిందని, సింగరేణి, విద్యుత్, ఆర్థిక, వ్యవసాయ రంగాలను అభివృద్ధి చేయడం జరిగిందని, రెవెన్యూ శాఖలో భూ భారతి ద్వారా భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. మహిళల సంక్షేమంలో భాగంగా మహాలక్ష్మి పథకంలో రాష్ట్రంలోని మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఇప్పటివరకు 11 వేల కోట్ల రూపాయలు ఆర్ టి సి సంస్థకు చెల్లించామని తెలిపారు. మహిళల ఆర్థిక అభివృద్ధి దిశగా సౌర విద్యుత్ ప్లాంట్ల నిర్వహణ, పెట్రోల్ బంకులు నడిపించేందుకు అవకాశం కల్పించడం జరిగిందని, హైదరాబాద్ లోని ఐ.టి. సంస్థల మధ్య 1 వేయి కోట్ల రూపాయల భూమిని ఇందిరా మహిళ భవన్ కు కేటాయించి స్వయం సహాయక సంఘాల ద్వారా 150 షాపులు ఏర్పాటు చేసి నిర్వహణకు అవకాశం కల్పించడం జరిగిందని, రాష్ట్రంలో దాదాపు 8 వేల స్వయం సహాయక సంఘాల సభ్యులతో ఒకేసారి సమావేశం నిర్వహించే విధంగా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా కేంద్రాలలో ఇందిరా మహిళా శక్తి భవనాలు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. రాష్ట్రంలోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించే దిశగా గ్రూప్ 1 నిర్వహించి 562 మంది అభ్యర్థులకు నియామక పత్రాలు అందించడం జరిగిందని, గ్రూప్ 2 లో 1 వేయి 100 మంది, అన్ని ప్రభుత్వ శాఖలలో దాదాపు 70 వేల ఉద్యోగాలను భర్తీ చేయడం జరిగిందని తెలిపారు. ఈ సంవత్సరం రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో రైతులు పంట మార్పిడి విధానాన్ని అవలంబించి కాలానుగుణంగా దిగుబడి వచ్చే పంట సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని తెలిపారు. రాష్ట్రంలో నడుస్తున్నది ప్రజా ప్రభుత్వమని, ప్రతి రంగానికి ప్రాధాన్యతనిస్తూ అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటుందని తెలిపారు. నాగులవంచ రైతు వేదిక నుండి జిల్లా కలెక్టర్ తో పాటు జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార అధికారి గంగాధర్, జిల్లా ఉద్యానవన అధికారి మధుసూదన్, అధికారులు, రైతులు పాల్గొన్నారు.



# ఒక్క ఓటు కూడా కోల్పోవద్దు.. ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయండి

- **వార్డుల పర్యటనలో కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, ప్రణవ్ బాబు..**

**జమ్మికుంట టౌన్ జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియను వేగవంతం చేయడంతో పాటు ప్రతి అర్హుడైన ఓటరు పేరు జాబితాలో ఉండేలా బూత్ స్థాయిలో అప్రమత్తంగా పనిచేయాలని కరీంనగర్ అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, హుజూరాబాద్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఓడితెల ప్రణవ్ బాబు బూత్ లెవెల్ ఏజెంట్లకు సూచించారు. మంగళవారం జమ్మికుంట పట్టణంలోని 4, 5, 19, 27, 28, 30 వార్డుల్లో కొనసాగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను వారు ప్రత్యక్షంగా పరిశీలించారు. బూత్ కోఆర్డినేటర్లు, బూత్ లెవెల్ ఏజెంట్లు, బీఎల్ఓలతో సమావేశమై ఓటరు నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియపై సమీక్ష నిర్వహించారు.

ఈ సందర్భంగా వార్డుల్లో పర్యటిస్తూ ఓటర్లతో నేరుగా మాట్లాడి వారి సందేహాలను తెలుసుకున్నారు. బీఎల్ఓలతో చర్చించి ఓటర్ల అనుమానాలను అక్కడికక్కడే నివృత్తి చేయించారు. ప్రతి బూత్ వద్ద బీఎల్ఓలతో పాటు బూత్ లెవెల్ ఏజెంట్లు తప్పనిసరిగా సమన్వయంతో పనిచేయాలని, ఒక్క అర్హుడైన ఓటరు కూడా తన ఓటు హక్కును కోల్పోకుండా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

అనంతరం నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ, జమ్మికుంట పట్టణంలో ప్రతి పది బూత్‌లకు ఒకరి చొప్పున మొత్తం నలుగురు కోఆర్డినేటర్లను నియమించామని, వారు ఏజెంట్లతో నిరంతరం సమన్వయం చేస్తూ ఎస్ఐఆర్ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించినట్లు తెలిపారు.

రాష్ట్ర రాజకీయాలపై స్పందిస్తూ, "ఇక్కడి ఎమ్మెల్యే ప్రజా సమస్యల కంటే వివాదాలకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై విమర్శలు చేసే ముందు, పదేళ్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రజలకు ఏం చేసిందో ఆత్మపరిశీలన చేసుకోవాలి" అని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ప్రస్తావిస్తూ, "లక్షల కోట్ల రూపాయలు ఖర్చు చేసి తెలంగాణ ప్రజలకు భారంగా మార్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తూ పేదల ప్రభుత్వంగా ముందుకు సాగుతోంది" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఎస్ఐఆర్ కోఆర్డినేటర్, జమ్మికుంట పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు, మున్సిపల్ కౌన్సిలర్లు, యువజన నాయకులు, మహిళా నాయకురాళ్లు, సీనియర్ నాయకులు, పార్టీ కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సూరారంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించిన మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్

- **అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి నమోదు చేయాలి – అధికారులకు మంత్రి ఆదేశం**



**ఎల్కతుర్తి, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** ఎల్కతుర్తి మండలంలోని సూరారం గ్రామంలో జరుగుతున్న ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) బూత్ స్థాయి ప్రతినిధులు (బీఎల్ఏలు) తో సమావేశమైన మంత్రి, ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరిని గుర్తించి ఇంటింటికీ వెళ్లి ఇంటి వారీ వివరాల నమోదు (ఎన్యూమరేషన్) ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామ సర్పంచ్‌తో పాటు స్థానిక ప్రజలతో సమావేశమైన మంత్రి, సూరారం గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామ ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని ప్రాధాన్యత ఆధారంగా అభివృద్ధి పనులు చేపట్టేలా సంబంధిత అధికారులకు సూచనలు చేశారు.

ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ప్రసాదరావు, ఎంపీఓ రవీందర్, మండల వ్యవసాయ అధికారి రాజ్‌కుమార్, సూరారం గ్రామ సర్పంచ్ నీల కొమరయ్య, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ముప్పు శ్రీనివాస్, పీసీసీ సభ్యుడు బొమ్మనపల్లి అశోక్ రెడ్డి, మాజీ మండల అధ్యక్షుడు ఇంద్రసేనారెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ గోలి రాజేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మాజీ జిల్లా ప్రధాన కార్యదర్శి వీరమల్లు రంజిత్ రెడ్డి, సింగిల్ విండో డైరెక్టర్ ముప్పు మహేందర్, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంబాల శ్రీకాంత్, మాజీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు హింగే శ్రీకాంత్, డాక్టర్ బొల్లెపోగు రమేష్ బాబు, గుడెల్లి నవీన్ కుమార్, శనగరపు వెంకటేష్, అంబాల స్వామి, పులి కృష్ణ, శ్రీకాంత్ రెడ్డి, పుల్లూరి శ్రీధర్ రావు, రవీందర్ గౌడ్, గూటం జోజి రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు ఈర భీమ్‌రాజ్, మంద సుమన్, అంబాల రమేష్, ఠాకూర్ రామ్‌సింగ్, బుసరి వినయ్, బొంకూరి క్రాంతికుమార్, అడ్డూరి అనిల్, నవీన్, ప్రశాంత్, కుడుతాడి రమేష్, అంబీర్ చందర్, సుకినే గోపాల్ రావు, సింగిల్ విండో డైరెక్టర్లు, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్లు, వివిధ గ్రామాల సర్పంచులు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, ఎన్నికల సిబ్బంది, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమం

***హుజూరాబాద్ నుంచి హెచ్చరిక!***




**హుజూరాబాద్, జూన్ 30(తెలంగాణ ముచ్చట్లు ):** భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ హుజూరాబాద్‌లో ప్రజారాజ్యం ఆర్మీ ఆధ్వర్యంలో భారీ నిరసన కార్యక్రమం నిర్వహించారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, భవన నిర్మాణ కార్మికులకు సంబంధించిన పెండింగ్ బిల్లులను వెంటనే విడుదల చేయాలని, నిర్మాణ రంగంలో ఉపాధి అవకాశాలను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రమాదాల్లో మరణించే లేదా తీవ్రంగా గాయపడే కార్మికుల కుటుంబాలకు రూ.5 లక్షల బీమా సాయం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మంది కార్మికుల రిజిస్ట్రేషన్లు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని తక్షణమే పూర్తి చేసి వెల్ఫేర్ బోర్డు డైరెక్టర్ కమిటీని ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. కార్మిక సంక్షేమ నిధులను పారదర్శకంగా వినియోగిస్తూ అర్హులైన ప్రతి కార్మికుడికి సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ప్రభుత్వం తమ డిమాండ్లను వెంటనే నెరవేర్చకపోతే జూలై 12 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు, ధర్నాలు ఉధృతం చేస్తామని ప్రజారాజ్యం ఆర్మీ నాయకులు హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో కార్మికులు, ప్రజారాజ్యం ఆర్మీ నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

## తెలంగాణలో జనసేన బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుంది



- **ముకుంద నాయుడు జనసేన పార్టీ వనపర్తి కోఆర్డినేటర్**

**వనపర్తి,జూన్30(తెలంగాణ ముచ్చట్లు):** తెలంగాణలో జనసేన పార్టీ వేగంగా ప్రజాదరణ పొందుతూ భవిష్యత్తులో బలమైన రాజకీయ శక్తిగా ఎదుగుతుందని పార్టీ వనపర్తి కోఆర్డినేటర్, రాష్ట్ర యూత్ వింగ్ నాయకుడు ముకుంద నాయుడు అన్నారు. వనపర్తి జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ఉన్న వారినే పార్టీలో చేర్చుకుంటామని, రానున్న స్థానిక సంస్థలు, గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎన్నికల్లో జనసేన తన సత్తా చాటుతుందని తెలిపారు.తెలంగాణలో పార్టీ ఎదుగుదలను చూసి ప్రత్యర్థి పార్టీలు అనవసర విమర్శలకు దిగుతున్నాయని అన్నారు.ప్రజా సమస్యలు, రాష్ట్ర అభివృద్ధి అంశాలపైనే జనసేన ప్రధానంగా పోరాటం చేస్తుందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలు వరకు ప్రజల తరఫున ఉద్యమాలు కొనసాగిస్తామని చెప్పారు. వ్యక్తిగత విమర్శలు చేయడం తమ పార్టీ విధానం కాదని, రాష్ట్ర ప్రయోజనాలే తమ లక్ష్యమని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జిల్లా, మండల నాయకులు, వీర మహిళా విభాగం నాయకులు, పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# యూరియా యాప్ ద్వారా రైతులకు పారదర్శకంగా యూరియా సరఫరా...



**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం బ్యూరో , జూన్ -30(తెలంగాణ ముచ్చట్లు ):** జిల్లాలో యూరియా నిల్వలు సమృద్ధిగా ఉన్నాయని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అన్నారు.

జిల్లాలోని అన్ని సహకార సంఘాల గోడౌన్లలో, సేల్ పాయింట్లలో యూరియా నిల్వలు అందుబాటులో ఉండేలా ప్రణాళికాబద్ధంగా పర్యవేక్షణ చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. జిల్లాకు 18832.34 మెట్రిక్ టన్నుల యూరియా చేరుకోగా, పాత నిల్వలను కలుపుకొని 24903.7 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో వచ్చిందన్నారు. ఇప్పటి వరకు 6071.13 మెట్రిక్ టన్నుల యూరియా అమ్మకం అయినట్లు కలెక్టర్ అన్నారు.

మంగళవారం చింతకాని మండలంలోని నాగులవంచ ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఎరువుల గిడ్డంగులు, విక్రయ కేంద్రాలను జిల్లా కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గోడౌన్లలో నిల్వ ఉన్న యూరియా, ఇతర ఎరువులను పరిశీలించి, స్టాక్ వివరాల రిజిస్టర్ లో పొందుపరచిన వాటికి అనుగుణంగా నిల్వలు అందుబాటులో ఉన్నాయా లేదా అని పరిశీలించారు. ఇప్పటివరకు ఎన్ని ఎరువుల బస్తాలు వచ్చాయి, ఎన్ని పంపిణీ చేశారు, ఇంకనూ ఎంత పరిమాణంలో నిల్వలు రావాల్సి ఉంది తదితర వివరాలను వ్యవసాయశాఖ అధికారులను అడిగి తెలుసుకున్నారు. యూరియా బుకింగ్ యాప్ పనితీరును కలెక్టర్ స్వయంగా రైతుల మొబైల్ ఫోన్ లో పరిశీలన చేసి యాప్ వల్ల సమకూరే ప్రయోజనాలను రైతులకు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ వానాకాలం సీజన్ పంటల సాగుకు అవసరమైన మేరకు పూర్తి స్థాయిలో ఎరువుల నిల్వలు జిల్లాలో అందుబాటులో ఉన్నాయని, యూరియ లభ్యత పై రైతులు ఆందోళనకు గురి కావద్దని సూచించారు. మన రాష్ట్రంలో అమలు అవుతున్న యూరియా బుకింగ్ యాప్ విధానాన్ని ఇతర రాష్ట్రాలు కూడా ఎరువుల పంపిణీ కోసం అమలు చేస్తున్నాయని, ఈ యాప్ వల్ల ఎలాంటి నష్టం లేదని, గత రబీ సీజన్లో కూడా రైతులకు ఇబ్బందులు లేకుండా అమలు చేయడం జరిగిందని గుర్తు చేశారు. ఎరువులు పక్కదారి పట్టకుండా, పారదర్శకంగా, ప్రణాళికాబద్ధంగా యూరియా పంపిణీకి బుకింగ్ యాప్ దోహదపడుతుందని, దీని విషయంలో రైతులు అపోహలకు గురి కావద్దని సూచించారు. జిల్లాతో పాటు మీ మండలంలో ఉన్న స్టాక్ వివరాలు కూడా యాప్ లో తెలుస్తాయని తెలిపారు. అదేవిధంగా యూరియా కు ప్రత్యామ్నాయగా నానో యూరియా వాడకం వల్ల కలిగే లాభాలపై రైతులకు అవగాహన ఉండాలన్నారు. ప్రయోగాత్మకంగా కొంత పరిమాణంలో నానో యూరియాను వినియోగించి ఫలితాలను స్వయంగా పరిశీలించాలని రైతులకు సూచించారు. రైతులను నానో యూరియా కొనాలని డీలర్లు, బలవంతం చేయవద్దని, వారు కోరిన ఎరువులు మాత్రమే అందించాలని, ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేయాలని ఒత్తిడి చేస్తే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. రైతులు పంటల అవసరంమేరకు మాత్రమే మోతాదుకు మించకుండా ఎరువులు, క్రిమిసంహారక మందులు వినియోగించే విధంగా, వ్యవసాయ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట జిల్లా వ్యవసాయ అధికారి పుల్లయ్య, జిల్లా సహకార శాఖ అధికారి గంగాధర్, చింతకాని మండల తహసీల్దార్ కిలారి బాబ్జీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, వ్యవసాయ శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# సేవకు గుర్తింపు.. జిల్లా బాధ్యతలతో శివన్నకు ఘన సన్మానం

**జమ్మికుంట, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** కరీంనగర్ జిల్లా జమ్మికుంట పట్టణానికి చెందిన సీనియర్ భారతీయ జనతా పార్టీ నాయకుడు బచ్చు శివకుమార్ (శివన్న)ను బీజేపీ ఎండోమెంట్ జిల్లా జాయింట్ కన్వీనర్గా పార్టీ నియమించింది. ఈ సందర్భంగా స్థానిక బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు ఘన సన్మానం నిర్వహించి శాలువాలు కప్పి, పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.



ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పార్టీ పట్ల బచ్చు శివకుమార్ చూపిన అంకితభావం, క్రమశిక్షణ, ప్రజాసేవా దృక్పథాన్ని గుర్తించిన పార్టీ అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించిందన్నారు. హిందూ దేవాలయాల పరిరక్షణ, ధార్మిక కార్యక్రమాల అభివృద్ధి, పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన విశేష కృషి చేశారని కొనియాడారు. ఎండోమెంట్ విభాగానికి సంబంధించిన అంశాల్లో బచ్చు శివకుమార్ అనుభవం జిల్లాలోని దేవాలయాల అభివృద్ధికి, భక్తుల సమస్యల పరిష్కారానికి ఉపయోగపడుతుందని నాయకులు విశ్వాసం వ్యక్తం చేశారు.

సన్మానానికి స్పందించిన బచ్చు శివకుమార్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ ఆశయాలకు అనుగుణంగా పని చేస్తూ ఎండోమెంట్ విభాగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు దేవాలయాల పరిరక్షణ, సనాతన ధర్మ ప్రచారం, భక్తుల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తానని అన్నారు.

అనంతరం నాయకులు మాట్లాడుతూ, బచ్చు శివకుమార్ నియామకం జమ్మికుంటకు గర్వకారణమని, ఆయన నాయకత్వంలో పార్టీ మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఈ కార్యక్రమంలో ఆకుల రాజేందర్, టంగుటూరి రాజ్కుమార్, సంపెల్లి సంపత్రావు, పొనగంటి రవికుమార్ (పీజేఆర్), యాంసాని సమ్మయ్య, సిరియాల విజయ్కుమార్, శ్రీనివాస్, మల్లికార్జున్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో దొడగుంటపల్లి నాయకులు

**పెద్దమందడి,జూన్30(తెలంగాణ ముచ్చట్లు):** పెద్దమందడి మండలం దొడగుంటపల్లి గ్రామంలో నిర్వహించిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో గ్రామ నాయకులు పాల్గొన్నారు.ఓటరు జాబితాలో కొత్త పేర్ల నమోదు, మార్పులు, చిరునామా సవరణలు, తొలగింపుల ప్రక్రియను పరిశీలించి, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో తప్పనిసరిగా నమోదు అయ్యేలా చర్యలు తీసుకోవాలని బి ఎల్ ఓలను కోరారు.ఈ సందర్భంగా నాయకులు గ్రామ ప్రజలకు ఓటరు నమోదు, సవరణల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు. 18 సంవత్సరాలు నిండిన యువతతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఓటరుగా నమోదు చేసుకోవాలని సూచించారు.



ప్రజలు తమ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు, చేర్పులు నిర్ణీత గడువులోగా చేయించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది, బూత్ స్థాయి అధికారులు (బీఎల్వోలు), గ్రామ నాయకులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, గ్రామస్థులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్వోలు సువర్ణ, జ్యోతి, స్థానిక సర్పంచ్ కొమ్ము పెంటయ్య, జానకి రాములు,శ్రీనివాస్ రెడ్డి.,సుదర్శన్.,నిరంజన్, శివారెడ్డి ,పి రాములు,మాజీ ఎంపిటిసి బాలప్ప, ఆటో మల్లయ్య.మరియు బొక్కలయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ సంక్షేమ విద్యాసంస్థల్లో విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి...

**జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**

**ఖమ్మం బ్యూరో , జూన్ -30(తెలంగాణ ముచ్చట్లు ):** సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వసతి గృహాల్లో విద్యార్థులకు సురక్షితమైన, పరిశుభ్రమైన వాతావరణంతో పాటు అన్ని మౌళిక సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ దివాకర్ టి.ఎస్. ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ లోని కలెక్టర్ ఛాంబర్ లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్ లతో కలిసి, సాంఘిక సంక్షేమ, గిరిజన సంక్షేమ, బీసీ సంక్షేమ, మైనారిటీ సంక్షేమ శాఖల అధికారులు, సంబంధిత ఆర్ సీఓ లతో హాస్టళ్ల నిర్వహణ, మౌళిక సదుపాయాలు, విద్యార్థుల సంక్షేమంపై జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, హాస్టళ్లలో తాగునీరు, విద్యుత్, టాయిలెట్ ,డార్మెటరీ, ఫర్నిచర్, వంటశాల, డైనింగ్ హాల్, భద్రతా ఏర్పాట్లు తదితర సౌకర్యాలు పూర్తిస్థాయిలో అందుబాటులో ఉండేలా చూడాలని చర్యలు తీసుకోవాలని అన్నారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని భవనాల స్థితిని పరిశీలించి, మరమ్మతులు అవసరమైన చోట వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహాలను అధికారులు ఆకస్మిక తనిఖీ చేసి లోపాలను వెంటనే గుర్తించి, నివేదిక సమర్పించాలని, తదనుగుణంగా ఆయా సంక్షేమ అధికారులు విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా చర్యలు చేపట్టాలని అన్నారు.



ప్రతి ప్రభుత్వ విద్యాసంస్థకు జీరో విద్యుత్ బిల్లు వచ్చేలా విద్యుత్ శాఖతో సమన్వయం చేసుకుని వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. కిచెన్, టాయిలెట్ వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తకుండా ఇంకుడుగుంతల నిర్మాణాలు చేయాలన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కార్యక్రమంలో పాఠశాలల పరిస్థితులను మెరుగ్గా తీర్చిదిద్దినట్లు, వసతిగృహాల మరమ్మతులకు నిధుల మంజూరికి ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. ప్రతి సంక్షేమ శాఖలో నియోజకవర్గానికి ఒకటి చొప్పున అధ్వాన్నస్థితిలో ఉన్న వసతి గృహాన్ని ఎంపికచేసి, పూర్తి స్థాయిలో తీర్చిదిద్దే విధంగా చర్యలకు నిధుల గురించి వెంటనే ప్రతిపాదనలు సమర్పించాలన్నారు. వర్షాకాలం కావున అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డోర్లు, కిటికీలు వైర్ మెష్ ఏర్పాట్లు, టాయిలెట్లమరమ్మత్తులు, నీటి నిల్వ లేకుండా చర్యలు వెంటనే చేయాలన్నారు. ఆహారం విషయంలో జిల్లాలో ఎక్కడ ఫుడ్ పాయిజన్ సమస్య ఉత్పన్నం కావడానికి వీలులేదని, ఎక్కడైనా సంఘటన జరిగితే కఠినచర్యలు వుంటాయని కలెక్టర్ అన్నారు.

యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ కు దగ్గరలోని వసతి గృహాలను మ్యాపింగ్ చేయాలన్నారు. వసతి గృహాల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసిన తరువాత గ్రీవెన్స్ లలో అడ్మిషన్లు, బదిలీల కొరకు వచ్చిన దరఖాస్తులకు మిగులు సీట్లలో అవకాశం కల్పించాలన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా బిసి, సాంఘీక సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, గిరిజన సంక్షేమ శాఖ డిడి విజయలక్ష్మి, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి ముజాహిద్, ఆయా శాఖల ఆర్ సీఓ లు, విద్యుత్ శాఖ ఏవో కె. శ్రీధర్, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత తగ్గింపు నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

- **మైస ఉపేందర్,మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపకులు**

**హైదరాబాద్,జూన్30(తెలంగాణ ముచ్చట్లు):** డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్కు కల్పిస్తున్న భద్రతను తగ్గించాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే వెనక్కి తీసుకోవాలని మాదిగ హక్కుల పరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మైస ఉపేందర్ మాదిగ డిమాండ్ చేశారు.బుధవారం నిర్వహించిన సంఘం సమావేశంలో ఆయన మాట్లాడుతూ, మాజీ ఐపీఎస్ అధికారి, అదనపు డీజీపీగా పనిచేసిన డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్కు ఎలాంటి ముందస్తు సమాచారం, నోటీసులు లేదా స్పష్టమైన కారణాలు తెలియజేయకుండా భద్రతను ఉపసంహరించుకోవాలని, బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని తిరిగి అప్పగించాలని పోలీసు అధికారులు ఫోన్ ద్వారా ఆదేశించడం ఆందోళనకరమని అన్నారు.



ప్రస్తుతం ప్రతిపక్ష పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రభుత్వ విధానాలను విమర్శిస్తున్నందుకే ఈ చర్యకు పాల్పడ్డారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు.

డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ 1995లో ఐపీఎస్ అధికారిగా సేవలు ప్రారంభించి సుమారు 26 సంవత్సరాలపాటు దేశానికి, రాష్ట్రానికి సేవలందించారని, తన విధి నిర్వహణలో అనేక సవాళ్లను సమర్థంగా ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఆయన విధి నిర్వహణ సమయంలో చట్టవ్యతిరేక శక్తుల నుంచి పలుమార్లు ప్రాణహాని ఎదురైన విషయం ప్రభుత్వానికి తెలిసినప్పటికీ భద్రతను తగ్గించడం సరైన నిర్ణయం కాదని అన్నారు.

డా. ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ భద్రత విషయంలో ప్రభుత్వం పునరాలోచన చేయాలని, ఆయనకు ఏదైనా అవాంఛనీయ ఘటన జరిగితే దానికి ప్రభుత్వమే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా మాదిగ సమాజం తరఫున ఆందోళనలు చేపడతామని మైస ఉపేందర్ మాదిగ తెలిపారు.

## విద్యుత్ భద్రతపై అప్రమత్తతే రక్షణ

- **రైతులు, వినియోగదారులకు డీఈ ఉపేందర్ కీలక సూచనలు**

**హుజూరాబాద్,జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు ):** విద్యుత్ వినియోగదారులు, రైతులు విద్యుత్ భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని కరీంనగర్ డీఈ (టెక్నికల్ అండ్ సేఫ్టీ) ఉపేందర్ సూచించారు. హుజూరాబాద్ టౌన్ పోలీస్ పరిధిలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడమే టీజీఎస్పీడీసీఎల్ ప్రధాన లక్ష్యమని తెలిపారు. విద్యుత్ శాఖ ప్రవేశపెట్టిన 'న్యూ మీటర్ స్కీమ్' వినియోగదారులకు ఎంతో ఉపయోగకరమని పేర్కొంటూ, క్షేత్రస్థాయిలో పనిచేసే ఉద్యోగులు ప్రజల సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. వ్యవసాయ విద్యుత్ వినియోగదారులు స్వయంగా విద్యుత్ స్తంభాలు మార్చే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు. విద్యుత్ లైన్లలో సాంకేతిక లోపాలు తలెత్తిన వెంటనే 1912 టోల్ ఫ్రీ నంబర్కు సమాచారం అందించాలని కోరారు. అనవసర విద్యుత్ లోడ్లను వినియోగించకుండా, నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించుకోవాలని రైతులకు సూచించారు. విద్యుత్ సరఫరా నాణ్యతను మెరుగుపరచడంతో పాటు ప్రమాదాల నివారణకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏడీఈలు, ఏఈలు, సబ్ ఇంజినీర్లు, విద్యుత్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక





# ఆరోగ్యవంతమైన భారత్‌తోనే వికసిత భారత్

- **వైద్య విద్యకు ప్రభుత్వ ప్రాధాన్యం**
- **సూపర్ స్పెషాలిటీ వైద్యులకు బాధ్యత గుర్తుచేసిన నడ్డా**
- **వైద్య మౌలిక వసతుల బలోపేతంపై దృష్టి**

ఆరోగ్యవంతమైన భారత్ నిర్మాణం ద్వారానే వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించగలమని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జగత్ ప్రకాశ్ నడ్డా అన్నారు. న్యూఢిల్లీలోని లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ సంస్థ 10వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొని పట్టాలు అందజేశారు. దేశంలో వైద్య విద్య, ఆరోగ్య సేవల విస్తరణకు కేంద్ర ప్రభుత్వం సమగ్రంగా కృషి చేస్తోందని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో వైద్య విద్యలో మౌలిక వసతులతో పాటు విద్యా నాణ్యత పెంపుపైనా సమాన దృష్టి సారించామని నడ్డా తెలిపారు. వైద్య కళాశాలల ఏర్పాటు, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల విస్తరణ, అత్యాధునిక సాంకేతికత వినియోగం వంటి అంశాల్లో దేశం గణనీయమైన పురోగతి సాధించిందన్నారు. వైద్య విద్యను కాలానుగుణంగా మార్చేందుకు అనేక సంస్కరణలు అమలు చేస్తున్నామని చెప్పారు.

సూపర్ స్పెషాలిటీ విద్యను అభ్యసించడం ఒక ప్రత్యేక అవకాశం మాత్రమే కాకుండా సమాజం పట్ల బాధ్యత కూడా అని నడ్డా పేర్కొన్నారు. అత్యున్నత విద్యను పూర్తి చేసిన వైద్యులు తమ సేవలను ప్రజల సంక్షేమానికి అంకితం చేయాలని సూచించారు. గ్రామీణ, వెనుకబడిన ప్రాంతాల్లో కూడా నాణ్యమైన వైద్య సేవలు అందించేందుకు యువ వైద్యులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. దేశంలో వైద్య మౌలిక వసతుల అభివృద్ధితో పాటు వైద్యుల సంఖ్య పెంపుపైనా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని కేంద్ర మంత్రి తెలిపారు. వైద్య విద్యలో ఆధునిక సాంకేతికత, పరిశోధనలకు ప్రాధాన్యం కల్పిస్తూ అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సంస్థలను అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని చెప్పారు.

లివర్ అండ్ బిలియరీ సైన్సెస్ సంస్థ వైద్య సేవలు, పరిశోధన, సూపర్ స్పెషాలిటీ వైద్య విద్యలో దేశంలో ప్రత్యేక గుర్తింపు పొందిందని నడ్డా ప్రశంసించారు. ఈ సంస్థ నుంచి పట్టభద్రులవుతున్న విద్యార్థులు తమ నైపుణ్యాలను సమాజ సేవకు వినియోగించాలని సూచించారు. వైద్య వృత్తిలో నైతిక విలువలు, సేవాభావం అత్యంత ముఖ్యమని అన్నారు. స్నాతకోత్సవ కార్యక్రమంలో ఉత్తీర్ణులైన విద్యార్థులకు అభినందనలు తెలిపిన నడ్డా, ఆరోగ్య రంగంలో భారతదేశాన్ని ప్రపంచంలో అగ్రగామిగా నిలబెట్టడంలో యువ వైద్యులు కీలక పాత్ర పోషించాలని ఆకాంక్షించారు. సమాజ ఆరోగ్యాన్ని పరిరక్షించేందుకు ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమాల్లో వైద్యులు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.




# మాదకద్రవ్యాలపై ఉక్కుపాదం

- **బెంగళూరులో రాష్ట్రస్థాయి కార్యక్రమం**
- **యువతను కాపాడేందుకు సమిష్టి పోరాటం**
- **పోలీసులకు పూర్తి స్వేచ్ఛ: సీఎం డీకే శివకుమార్**

మాదకద్రవ్యాల అక్రమ రవాణా, వినియోగాన్ని పూర్తిగా నిర్మూలించేందుకు కర్ణాటక ప్రభుత్వం కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందని ముఖ్యమంత్రి డీకే శివకుమార్ తెలిపారు. బెంగళూరులోని కంఠీరవ క్రీడా సముదాయంలో కర్ణాటక రాష్ట్ర పోలీసు శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణా నిరోధక దినోత్సవ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర హోంమంత్రి ప్రియాంక్ ఖర్గే కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా డీకే శివకుమార్ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మాదకద్రవ్యాల ముఠాలను మూలాలతో సహా నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు. సంఘటిత నేరాలను అరికట్టేందుకు రాష్ట్ర పోలీసు శాఖకు పూర్తి స్వేచ్ఛ కల్పించామని, ఎలాంటి రాజకీయ జోక్యం లేకుండా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు.

మాదకద్రవ్యాల సమస్యను కేవలం చట్టాలతోనే అరికట్టడం సాధ్యం కాదని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, సాధారణ ప్రజలు అందరూ కలిసి అవగాహన కల్పించినప్పుడే ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని చెప్పారు. ప్రతి కుటుంబం పిల్లల ప్రవర్తనపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. "చక్రవ్యూహాన్ని ఛేదిద్దాం.. సంఘటిత నేరాలను అడ్డుకుందాం" అనే నినాదంతో ప్రభుత్వం మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమాన్ని మరింత బలోపేతం చేస్తోందని డీకే శివకుమార్ తెలిపారు. మాదకద్రవ్యాల సరఫరా, అక్రమ రవాణా, వినియోగాన్ని అరికట్టేందుకు పోలీసు శాఖ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. యువతకు సురక్షితమైన భవిష్యత్తు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలనలో ప్రజల భాగస్వామ్యం అత్యంత కీలకమని ముఖ్యమంత్రి అన్నారు. అనుమానాస్పద కార్యకలాపాలను వెంటనే పోలీసులకు తెలియజేయాలని, సమాజాన్ని ఈ సామాజిక రుగ్మత నుంచి కాపాడేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ప్రజల సహకారంతోనే మాదకద్రవ్యాల రహిత కర్ణాటకను నిర్మించగలమని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే రిజ్వాన్ అర్షద్, రాష్ట్ర పోలీసు డైరెక్టర్ జనరల్ ఎం.ఏ. సలీం, అదనపు ప్రధాన కార్యదర్శి రాజేంద్ర కుమార్ కటారియా, బెంగళూరు నగర పోలీసు కమిషనర్ సీమంత్ కుమార్ సింగ్, అదనపు డైరెక్టర్ జనరల్ ఆర్. హితేంద్రతో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలనపై అవగాహన కల్పించే పలు కార్యక్రమాలు కూడా నిర్వహించారు.



# సముద్రంలో ఆరుగురి ప్రాణాలు కాపాడిన కోస్ట్ గార్డ్

- **మంగళూరు తీరంలో వేగవంతమైన సహాయక చర్యలు**
- **దెబ్బతిన్న మత్స్య పడవలో చిక్కుకున్న జాలర్ల రక్షణ**
- **సురక్షితంగా న్యూ మంగళూరుకు తరలింపు**

మంగళూరు తీరానికి సమీపంలో ప్రమాదానికి గురైన మత్స్య పడవలో చిక్కుకున్న ఆరుగురు జాలర్లను భారత తీర రక్షక దళం సురక్షితంగా రక్షించింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నప్పటికీ వేగంగా స్పందించిన కోస్ట్ గార్డ్ బృందం సమర్థవంతమైన సహాయక చర్యలు చేపట్టి వారిని ప్రాణాపాయం నుంచి కాపాడింది. భారత తీర రక్షక దళానికి చెందిన 'సచేత్' నౌక జూన్ 29న అత్యవసర సమాచారాన్ని అందుకున్న వెంటనే ఘటన స్థలానికి చేరుకుంది. 'మంజు మాథా' అనే మత్స్య పడవ సముద్ర అలల ధాటికి దెబ్బతిని అడుగు భాగంలో పగుళ్లు ఏర్పడటంతో నీరు లోనికి చేరి ప్రమాదకర పరిస్థితి నెలకొంది.



దీంతో పడవలో ఉన్న జాలర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. ప్రమాద స్థితిని గుర్తించిన కోస్ట్ గార్డ్ సిబ్బంది రిమోట్ ఆధారిత లైఫ్‌బోయ్‌లను వినియోగించి జాలర్లను ఒక్కొక్కరిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు. ప్రతికూల వాతావరణం మధ్య కూడా అత్యంత సమర్థవంతంగా రక్షణ చర్యలు నిర్వహించి అందరి ప్రాణాలను కాపాడారు. ఈ ఆపరేషన్‌ను అధికారులు విజయవంతంగా పూర్తి చేశారు.

రక్షించిన ఆరుగురిని వైద్య పరీక్షలు, అవసరమైన సహాయం కోసం న్యూ మంగళూరు నౌకాశ్రయానికి తరలిస్తున్నారు. అనంతరం వారిని స్థానిక అధికారులకు అప్పగించనున్నట్లు భారత తీర రక్షక దళం వెల్లడించింది. జాలర్ల ఆరోగ్య పరిస్థితిపై కూడా అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగిస్తున్నారు. సముద్ర భద్రతలో భాగంగా అత్యవసర పరిస్థితుల్లో తక్షణ స్పందన అందించడం తమ ప్రధాన బాధ్యత అని కోస్ట్ గార్డ్ అధికారులు తెలిపారు. సముద్రంలో ప్రయాణించే మత్స్యకారులు వాతావరణ హెచ్చరికలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ప్రమాద సమయంలో వేగంగా సమాచారం అందించడం వల్లే రక్షణ చర్యలు సకాలంలో చేపట్టగలిగామని పేర్కొన్నారు. సముద్రంలో ప్రతి ప్రాణం అమూల్యమనే లక్ష్యంతో భారత తీర రక్షక దళం నిరంతరం అప్రమత్తంగా సేవలందిస్తోందని అధికారులు తెలిపారు. శోధన, రక్షణ చర్యల్లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ సముద్ర భద్రతను మరింత బలోపేతం చేస్తున్నట్లు వెల్లడించారు.

# భారత సైన్యానికి కొత్త అధిపతి

- **జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణ**
- **జనరల్ ఉపేంద్ర ద్వివేది పదవీ విరమణ**
- **నాలుగు దశాబ్దాల సైనిక అనుభవం**



భారత సైన్యానికి 31వ సైన్యాధిపతిగా జనరల్ ధీరజ్ సేథ్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. పదవీ విరమణ చేసిన జనరల్ ఉపేంద్ర ద్వివేది నుంచి ఆయన బాధ్యతలను అధికారికంగా చేపట్టారు. నాలుగు దశాబ్దాలకు చేరువైన సుదీర్ఘ సైనిక సేవా అనుభవంతో జనరల్ ధీరజ్ సేథ్ భారత సైన్యానికి నాయకత్వం వహించనున్నారు. జనరల్ ఉపేంద్ర ద్వివేది దేశానికి నాలుగు దశాబ్దాలకుపైగా విశిష్ట సేవలు అందించి జూన్ 30న పదవీ విరమణ చేశారు. ఆయన హయాంలో సరిహద్దు భద్రత, సైనిక సంస్కరణలు, ఆధునికీకరణ, కార్యాచరణ సామర్థ్యాల పెంపుపై ప్రత్యేక దృష్టి సారించినట్లు రక్షణ శాఖ పేర్కొంది. ఆయన సేవలను ఈ సందర్భంగా సైన్యం అభినందించింది. కొత్త సైన్యాధిపతి జనరల్ ధీరజ్ సేథ్ తన సైనిక జీవితంలో కార్యాచరణ, వ్యూహాత్మక ప్రణాళిక, సామర్థ్యాల అభివృద్ధి, సంస్థాగత నిర్వహణ వంటి కీలక విభాగాల్లో విస్తృత అనుభవాన్ని సంపాదించారు. భారత సైన్యాన్ని ఆధునికీకరించడంలో, యుద్ధ సామర్థ్యాలను మరింత బలోపేతం చేయడంలో ఆయన కీలక పాత్ర పోషించినట్లు అధికారులు తెలిపారు.

దేశ భద్రతకు అనుగుణంగా మారుతున్న సవాళ్లను ఎదుర్కొనేందుకు సైన్యాన్ని మరింత సమర్థంగా తీర్చిదిద్దే దిశగా జనరల్ ధీరజ్ సేథ్ నాయకత్వం కీలకంగా మారనుందని రక్షణ వర్గాలు భావిస్తున్నాయి. ఆధునిక సాంకేతికత వినియోగం, వ్యూహాత్మక సామర్థ్యాల పెంపు, సైనిక సంస్కరణలకు ఆయన ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. సరిహద్దు భద్రతతో పాటు దేశ రక్షణ అవసరాలకు అనుగుణంగా సైన్యాన్ని మరింత బలోపేతం చేయడం, భవిష్యత్ అవసరాలకు తగిన విధంగా మార్పులు తీసుకురావడం కొత్త సైన్యాధిపతి ముందున్న ప్రధాన బాధ్యతలుగా భావిస్తున్నారు. దేశ భద్రతకు అత్యున్నత ప్రాధాన్యమిస్తూ సైన్యం తన విధులను సమర్థంగా కొనసాగించనుంది.

జనరల్ ధీరజ్ సేథ్ బాధ్యతల స్వీకరణతో భారత సైన్యంలో కొత్త అధ్యాయం ప్రారంభమైంది. ఆయన నాయకత్వంలో సైన్యం ఆధునికీకరణ, యుద్ధ సామర్థ్యాల పెంపు, సరిహద్దుల భద్రత, వ్యూహాత్మక సిద్ధత వంటి అంశాల్లో మరింత పురోగతి సాధిస్తుందనే ఆశాభావాన్ని రక్షణ వర్గాలు వ్యక్తం చేస్తున్నాయి.

# అమర్‌నాథ్ యాత్రకు ఉగ్ర ముప్పు

జూలై 3 నుంచి ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకుని ఉగ్రవాదులు దాడులకు పాల్పడే అవకాశం ఉందని భారత నిఘా సంస్థలు హెచ్చరించిన నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వం భద్రతను మరింత కట్టుదిట్టం చేసింది. యాత్ర మార్గాల్లో పోలీసు, కేంద్ర భద్రతా బలగాలను భారీ సంఖ్యలో మోహరించడంతో పాటు అత్యాధునిక నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేసింది. యాత్రికుల భద్రతకు ఎలాంటి లోటు లేకుండా అన్ని చర్యలు చేపట్టినట్లు అధికారులు తెలిపారు. నిఘా వర్గాల సమాచారం ప్రకారం పాకిస్థాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా, బలూచిస్థాన్, పాక్ ఆక్రమిత కశ్మీర్ ప్రాంతాల్లో నెలకొన్న పరిస్థితుల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు పాకిస్థాన్ గూఢచార సంస్థ ఐఎస్ఐ భారత్‌లో అలజడి సృష్టించే ప్రయత్నాలు చేసే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఈ క్రమంలో అమర్‌నాథ్ యాత్రను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే అవకాశాలపై భద్రతా సంస్థలు అప్రమత్తమయ్యాయి. జమ్ముకశ్మీర్‌లోని అటవీ ప్రాంతాల్లో దాక్కున్న ఉగ్రవాదులతో పాకిస్థాన్‌కు చెందిన వర్గాలు సంప్రదింపులు జరుపుతున్నట్లు నిఘా సంస్థలు గుర్తించినట్టు సమాచారం. పెద్ద ఎత్తున దాడులు జరిగేలా వారిని ప్రేరేపించే ప్రయత్నాలు జరుగుతున్నాయనే అనుమానంతో భద్రతా సంస్థలు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నాయి. ఈ నేపథ్యంలో యాత్ర మార్గంలోని ప్రతి ప్రాంతాన్ని క్షుణ్ణంగా పర్యవేక్షిస్తున్నారు. యాత్రికుల రక్షణ కోసం కృత్రిమ మేధ ఆధారిత అత్యాధునిక కెమెరాలు, డిజిటల్ స్కానింగ్ వ్యవస్థలు, డ్రోన్ నిఘా వంటి ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నారు. యాత్ర మార్గంలోని అన్ని కీలక ప్రాంతాల్లో అదనపు భద్రతా బలగాలను మోహరించి నిరంతర పర్యవేక్షణ చేపడుతున్నారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు ప్రత్యేక బృందాలను కూడా సిద్ధంగా ఉంచారు. ఇదిలా ఉండగా జమ్ముకశ్మీర్‌లోని రాజౌరీ జిల్లాలో ఉగ్రవాదుల కోసం భద్రతా బలగాలు విస్తృతంగా గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. దట్టమైన అటవీ ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్‌లు నిర్వహిస్తూ అనుమానాస్పద కదలికలపై నిఘా పెంచాయి. ఉగ్రవాదుల సంచారాన్ని పూర్తిగా అడ్డుకునే లక్ష్యంతో భద్రతా సంస్థలు సమన్వయంతో పనిచేస్తున్నాయి. యాత్రికులు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని, భద్రతా తనిఖీలకు సహకరించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. వదంతులను నమ్మకుండా అధికారిక సమాచారం మాత్రమే విశ్వసించాలని సూచించారు. యాత్ర ప్రశాంతంగా, సురక్షితంగా జరిగేలా కేంద్రం, జమ్ముకశ్మీర్ పరిపాలన అన్ని స్థాయిల్లో సమగ్ర భద్రతా ఏర్పాట్లు చేపట్టినట్లు వెల్లడించింది.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక




# మైక్రోసాఫ్ట్‌కు భారీ ఎదురుదెబ్బ

ప్రపంచ సాంకేతిక రంగ దిగ్గజ సంస్థ మైక్రోసాఫ్ట్‌కు జూన్ నెల తీవ్ర నిరాశను మిగిల్చింది. కంపెనీ షేర్లు భారీ ఒత్తిడిని ఎదుర్కొనడంతో మార్కెట్ విలువలో ఏకంగా 570 బిలియన్ డాలర్లు, అంటే భారత కరెన్సీలో దాదాపు రూ.49 లక్షల కోట్లకు పైగా క్షీణించింది. 2000 సంవత్సరంలో సంభవించిన డాట్‌కామ్ సంక్షోభం తర్వాత మైక్రోసాఫ్ట్‌కు ఇదే అత్యంత ప్రతికూల నెలగా మార్కెట్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. గత పాతికేళ్లలో కంపెనీ మార్కెట్ విలువ ఇంత భారీ స్థాయిలో ఒక్క నెలలో క్షీణించడం ఇదే తొలిసారి కావడం విశేషం.

ఇటీవలి కాలంలో కృత్రిమ మేధస్సు రంగంపై మైక్రోసాఫ్ట్ భారీగా పెట్టుబడులు పెడుతోంది. ఆధునిక డేటా కేంద్రాల నిర్మాణం, కృత్రిమ మేధస్సుకు అవసరమైన ప్రత్యేక చిప్‌ల తయారీ, అధునాతన మౌలిక సదుపాయాల విస్తరణ కోసం బిలియన్ డాలర్ల మేర పెట్టుబడులు కేటాయించింది. అయితే ఈ పెట్టుబడుల ద్వారా తక్షణ ఫలితాలు కనిపించకపోవడం, లాభాల వృద్ధి ఆశించిన స్థాయిలో లేకపోవచ్చనే అంచనాలు పెట్టుబడిదారుల్లో ఆందోళనకు దారితీశాయి. దాంతో జూన్ నెలలో మైక్రోసాఫ్ట్ షేర్లు సుమారు 17 శాతం వరకు క్షీణించాయి. భవిష్యత్తులో కృత్రిమ మేధస్సు విస్తృతంగా వినియోగంలోకి వస్తే సాంప్రదాయ సాఫ్ట్‌వేర్ సేవలపై డిమాండ్ తగ్గే అవకాశముందన్న ఆందోళన కూడా షేర్ల పతనానికి ఒక ప్రధాన కారణంగా మారింది. సంస్థ భవిష్యత్ ఆదాయ వృద్ధిపై పెట్టుబడిదారులు అప్రమత్తంగా వ్యవహరించడంతో మార్కెట్‌లో అమ్మకాల ఒత్తిడి పెరిగింది.

ఇటీవల విడుదల చేసిన త్రైమాసిక ఆర్థిక ఫలితాల్లో మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్ సేవల విభాగం వృద్ధి మార్కెట్ అంచనాలను అందుకోలేకపోయింది. ముఖ్యంగా అజ్యూర్ క్లౌడ్ సేవల విస్తరణ ఆశించినంత వేగంగా లేకపోవడం పెట్టుబడిదారులను నిరాశపరిచింది. అదే సమయంలో ఈ ఏడాది చివరి నాటికి అజ్యూర్ క్లౌడ్ మౌలిక సదుపాయాల అభివృద్ధి కోసం సుమారు 190 బిలియన్ డాలర్ల మూలధన వ్యయం చేయనున్నట్లు సంస్థ ప్రకటించడం కూడా మార్కెట్‌లో ఆందోళనను మరింత పెంచింది.

అయితే ఈ పరిణామాలపై మార్కెట్ నిపుణులు భిన్నాభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నారు. కొందరు విశ్లేషకులు దీర్ఘకాలిక పెట్టుబడిదారులకు ఇది మంచి కొనుగోలు అవకాశమని భావిస్తుండగా, మరికొందరు మాత్రం కృత్రిమ మేధస్సుపై చేసిన భారీ పెట్టుబడులు ఎలాంటి ఫలితాలు ఇస్తాయో స్పష్టత వచ్చే వరకు జాగ్రత్తగా వ్యవహరించాలని సూచిస్తున్నారు. ప్రస్తుతం ప్రపంచ సాంకేతిక రంగంలో నెలకొన్న అనిశ్చిత పరిస్థితులు, పెట్టుబడిదారుల ఆందోళనలు మైక్రోసాఫ్ట్ షేర్లపై ప్రభావం చూపుతున్నాయని మార్కెట్ వర్గాలు పేర్కొంటున్నాయి.

# వాట్సప్‌లో కొత్త "సైడ్ చాట్" ఫీచర్.. వినియోగదారులకు పెరిగిన ప్రైవసీ

ప్రముఖ మెస్సేజింగ్ యాప్ వాట్సప్ వినియోగదారుల కోసం మరిన్ని ప్రైవసీ ఫీచర్లను అందుబాటులోకి తీసుకొస్తోంది. తాజాగా "సైడ్ చాట్" అనే కొత్త ఫీచర్‌ను విడుదల చేసింది. ఈ ఫీచర్ ద్వారా యూజర్లు ప్రత్యేకమైన ప్యానెల్‌లో చాట్స్‌ను నిర్వహించుకోవచ్చు, దీంతో చాట్‌లకు మరింత భద్రత, ప్రైవసీ లభిస్తుందని కంపెనీ తెలిపింది. ఈ కొత్త ఫీచర్ ద్వారా వినియోగదారులు వాట్సప్‌లోనే మెటా ఏఐ ను మరింత సులభంగా, ప్రైవేట్‌గా ఉపయోగించుకోవచ్చు. ఆండ్రాయిడ్, ఐఓఎస్ వినియోగదారులకు ఇది దశలవారీగా అందుబాటులోకి వస్తోంది. వాట్సప్ ఇటీవల "ఇంకాగ్నిటో మోడ్" అనే ఫీచర్‌ను కూడా ప్రారంభించిన విషయం తెలిసిందే. ఈ మోడ్‌లో మెటా ఏఐతో జరిపే సంభాషణలు మరింత గోప్యంగా ఉంటాయి. యూజర్ చాట్‌లను మెటా కూడా యాక్సెస్ చేయలేని విధంగా ప్రైవసీ ప్రోటోకాల్ టెక్నాలజీని అమలు చేసినట్లు సమాచారం.ఈ కొత్త సైడ్ చాట్ ఫీచర్ ద్వారా చాటింగ్ చేస్తూనే వెంటనే మెటా ఏఐను యాక్సెస్ చేసే అవకాశం ఉంటుంది. అవసరమైన సమాచారాన్ని వెంటనే పొందేందుకు ఇది ఉపయోగపడుతుందని వాట్సప్ పేర్కొంది. ఈ ఫీచర్‌ను ఓపెన్ చేయడానికి చాట్ స్క్రీన్‌లో ఎడమవైపుకు స్వైప్ చేయాల్సి ఉంటుందని సమాచారం. ప్రస్తుతం కొంతమంది యూజర్లకు మాత్రమే అందుబాటులో ఉన్న ఈ ఫీచర్ త్వరలో అన్ని యూజర్లకు విడుదల కానుంది.




# బడ్జెట్‌లో 5 స్టార్ సేఫ్టీ కార్లు ఇవే

భారత ఆటోమొబైల్ మార్కెట్లో సేఫ్టీకి ప్రాధాన్యం ఇస్తున్న వినియోగదారులకు 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ పొందిన కార్లు మంచి ఎంపికలుగా మారుతున్నాయి. గ్లోబల్ ఎన్‌సీఏపీ క్రాష్ టెస్టుల్లో అత్యుత్తమ రేటింగ్ సాధించిన మోడళ్లు ఇప్పుడు బడ్జెట్ విభాగంలో కూడా అందుబాటులో ఉండటం విశేషం.

టాటా నెక్సాన్ సబ్‌కాంపాక్ట్ ఎస్‌యూవీ విభాగంలో అత్యంత ప్రజాదరణ పొందిన మోడల్‌గా నిలిచింది. ఇది గ్లోబల్ ఎన్‌సీఏపీ పరీక్షల్లో 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించింది. బలమైన బాడీ నిర్మాణంతో పాటు ఇందులో 6 ఎయిర్‌బ్యాగులు, ఏబీఎస్ విత్ ఈబీడీ, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, రోల్ ఓవర్ మిటిగేషన్, ఐసోఫిక్స్ చైల్డ్ సీట్ మౌంట్స్ వంటి ముఖ్యమైన సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి.

టాటా పంచ్ ఈవీ కూడా సుమారు రూ.10 లక్షల బడ్జెట్‌లో లభించే మరో 5 స్టార్ సేఫ్టీ ఎలక్ట్రిక్ కారు. ఇది ప్రత్యేక 'ఆక్టి ఈవీ' ప్లాట్‌ఫారమ్‌పై రూపొందించబడింది. ఇందులో 6 ఎయిర్‌బ్యాగులు, 4 డిస్క్ బ్రేకులు, 360 డిగ్రీ కెమెరా, బ్లైండ్ స్పాట్ మానిటర్ వంటి ఆధునిక ఫీచర్లు ఉన్నాయి.

మారుతి సుజుకి డిజైర్ ఇటీవల గ్లోబల్ ఎన్‌సీఏపీ పరీక్షల్లో 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ సాధించింది. బలమైన బాడీ నిర్మాణంతో పాటు ఇందులో 6 ఎయిర్‌బ్యాగులు, హిల్ హోల్డ్ అసిస్ట్, రివర్స్ పార్కింగ్ సెన్సార్లు, అన్ని ప్రయాణికులకు 3 పాయింట్ సీట్ బెల్ట్ రిమైండర్ వంటి సేఫ్టీ ఫీచర్లు ఉన్నాయి.

టాటా ఆల్ట్రోజ్ కూడా బడ్జెట్ సెగ్మెంట్‌లో లభించే 5 స్టార్ సేఫ్టీ రేటింగ్ కలిగిన ప్రీమియం హ్యాచ్‌బ్యాక్‌గా నిలిచింది. దీని ప్రారంభ ధర సుమారు రూ.6.30 లక్షలుగా ఉంది. బలమైన బాడీతో పాటు ఆధునిక సేఫ్టీ ఫీచర్లు ఇందులో అందుబాటులో ఉన్నాయి.







# జులై 4 నుంచి అమెజాన్ మెగా సేల్

ప్రముఖ ఈ-వాణిజ్య సంస్థ అమెజాన్ నిర్వహించే వార్షిక మెగా డిస్కౌంట్ ఉత్సవం 'ప్రైమ్ డే-2026' తేదీలను సంస్థ అధికారికంగా ప్రకటించింది. జులై 4 అర్ధ రాత్రి నుంచి జులై 6 వరకు వరుసగా 72 గంటల పాటు ఈ ప్రత్యేక విక్రయాలు కొనసాగనున్నాయి. భారతదేశంలో అమెజాన్ ప్రైమ్ సేవలకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఈసారి మరింత ఆకర్షణీయమైన ఆఫర్లతో వినియోగదారులను ఆకట్టుకునేందుకు సంస్థ ఏర్పాట్లు చేసింది.

ఈ ప్రత్యేక విక్రయాలు కేవలం ప్రైమ్ సభ్యులకు మాత్రమే అందుబాటులో ఉంటాయి. స్మార్ట్‌ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు, స్మార్ట్ టెలివిజన్లు, గృహోపకరణాలు, ఎలక్ట్రానిక్ వస్తువులు తదితర విభాగాలపై భారీ ధర తగ్గింపులు కల్పించనున్నారు. ప్రముఖ బ్రాండ్లకు చెందిన ప్రీమియం మొబైల్ ఫోన్లు, మధ్యస్థ శ్రేణి పరికరాలు, అత్యాధునిక ల్యాప్‌టాప్‌లు ప్రత్యేక ధరలకు విక్రయించనున్నట్లు సంస్థ వెల్లడించింది. స్మార్ట్ టెలివిజన్ల విభాగంలో ప్రముఖ బ్రాండ్ల ఉత్పత్తులపై గరిష్ఠంగా 75 శాతం వరకు ధర తగ్గింపులు ఉండనున్నాయి. అదనంగా కొన్ని ఎంపిక చేసిన బ్యాంకుల క్రెడిట్ కార్డులతో కొనుగోలు చేసే వినియోగదారులకు 10 శాతం తక్షణ రాయితీ లభిస్తుంది. అమెజాన్‌కు అనుబంధంగా ఉన్న ప్రత్యేక క్రెడిట్ కార్డు వినియోగదారులకు అదనపు నగదు తిరిగి చెల్లింపు సదుపాయం కూడా కల్పించారు. అలాగే ఒకేసారి మొత్తం చెల్లించలేని వారికి అదనపు వడ్డీ లేకుండా నెలవారీ వాయిదాల పద్ధతిలో కొనుగోలు చేసే అవకాశం కూడా అందుబాటులో ఉంటుంది.

ప్రైమ్ సేవలకు పదేళ్లు పూర్తయిన సందర్భంగా సభ్యత్వ రుసుములపై కూడా సంస్థ ప్రత్యేక రాయితీలు ప్రకటించింది. వార్షిక సభ్యత్వాన్ని గతంతో పోలిస్తే తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురాగా, ఇతర సభ్యత్వ పథకాల ధరలను కూడా తగ్గించింది. దీంతో కొత్తగా సభ్యత్వం తీసుకునే వినియోగదారులకు ఇది మంచి అవకాశంగా మారనుంది.

ఈ 72 గంటల మెగా విక్రయాల సందర్భంగా ఐదు వందలకు పైగా కొత్త ఉత్పత్తులను మార్కెట్లోకి విడుదల చేయనున్నట్లు అమెజాన్ ప్రకటించింది. సాంకేతిక పరికరాలతో పాటు గృహోపకరణాలు, ఫ్యాషన్ ఉత్పత్తులు, ఆరోగ్య సంరక్షణ, అందాల ఉత్పత్తులు, వంటింటి సామగ్రి తదితర విభాగాల్లో కూడా ప్రత్యేక ఆఫర్లు అందుబాటులో ఉండనున్నాయి. తక్కువ ధరల్లో నాణ్యమైన ఉత్పత్తులు కొనుగోలు చేయాలనుకునే వినియోగదారులకు ఈ మెగా సేల్ మంచి అవకాశంగా నిలవనుంది.



# పాత నోట్ల రద్దు వార్తలు అసత్యం

దేశంలో మరోసారి కరెన్సీ నోట్ల రద్దు జరగబోతోందంటూ సామాజిక మాధ్యమాల్లో జరుగుతున్న ప్రచారాన్ని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా ఖండించింది. 2005 సంవత్సరానికి ముందు ముద్రించిన రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లను జులై 1 నుంచి చెల్లుబాటు కాకుండా చేయనున్నారంటూ వైరల్ అవుతున్న సందేశాల్లో ఎలాంటి నిజం లేదని స్పష్టం చేసింది. ప్రజలు ఇటువంటి తప్పుడు ప్రచారాలను నమ్మి ఆందోళన చెందవద్దని సూచించింది.

ఈ అంశంపై కేంద్ర ప్రభుత్వ అధికారిక సమాచార సంస్థ ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో స్పందించింది. వైరల్ అవుతున్న వార్తలను పరిశీలించిన అనంతరం అవి పూర్తిగా అవాస్తవమని, తప్పుడు ప్రచారమని తేల్చిచెప్పింది. పాత కరెన్సీ నోట్లను రద్దు చేయాలన్న నిర్ణయాన్ని కేంద్ర ప్రభుత్వం గానీ, భారతీయ రిజర్వు బ్యాంకు గానీ తీసుకోలేదని స్పష్టం చేసింది. ఇటీవలి రోజుల్లో వాట్సాప్, ఫేస్‌బుక్ తదితర సామాజిక మాధ్యమాల్లో 'రేపటి నుంచి పాత నోట్లు చెల్లవు' అంటూ నకిలీ సమాచారంతో కూడిన చిత్రాలు, సందేశాలు విస్తృతంగా ప్రచారం అవుతున్నాయి. వీటిని నమ్మి ఎవరూ అపోహలకు గురికావద్దని అధికారులు కోరుతున్నారు.

ఆర్థిక నిపుణుల వివరాల ప్రకారం, భారతీయ రిజర్వు బ్యాంకు కాలానుగుణంగా పాత సిరీస్ కరెన్సీ నోట్లను మార్కెట్ నుంచి క్రమంగా ఉపసంహరించి, వాటి స్థానంలో కొత్త నోట్లను విడుదల చేస్తుంది. అయితే ఒక్కసారిగా పాత నోట్లను రద్దు చేస్తూ ఎలాంటి అధికారిక ప్రకటన గానీ, ఉత్తర్వులు గానీ జారీ చేయలేదు. అందువల్ల ప్రస్తుతం చెలామణిలో ఉన్న పాత సిరీస్ రూ.10, రూ.20, రూ.50, రూ.100 నోట్లు యథావిధిగా చెల్లుబాటులోనే ఉన్నాయని స్పష్టం చేశారు.

ప్రజలు కరెన్సీకి సంబంధించిన సమాచారం విషయంలో అధికారిక ప్రకటనలను మాత్రమే విశ్వసించాలని, సామాజిక మాధ్యమాల్లో ప్రచారంలో ఉన్న నిర్ధారణలేని వార్తలను పంచుకోవద్దని కేంద్ర ప్రభుత్వం విజ్ఞప్తి చేసింది.

తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU
ఎడిటర్: బొల్లిపాక రాజేష్ తెలుగు దిన పత్రిక



# దిల్‌రుబా భామ రుక్సార్ ధిల్లాన్ అందాల సందడి

'దిల్‌రుబా' చిత్రంలో కిరణ్ అబ్బవరం సరసన నటించిన రుక్సార్ ధిల్లాన్ తన అందం, అభినయంతో తెలుగు ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. గ్లామర్‌తో పాటు నటనకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంచుకుంటూ సినీ ప్రయాణాన్ని విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

2015లో విడుదలైన కన్నడ చిత్రం 'కట్టె' ద్వారా సినీ రంగ ప్రవేశం చేసిన రుక్సార్, 2016లో 'రన్ ఆంటోని' సినిమాతో గుర్తింపు పొందారు. అనంతరం 'ఆకతాయి' చిత్రంతో టాలీవుడ్‌లో అడుగుపెట్టారు.

తెలుగులో 'కృష్ణార్జున యుద్ధం', 'ఏబీసీడీ: అమెరికన్ బోర్న్ కన్ఫ్యూజ్డ్ దేశి', 'అశోక వనంలో అర్జున కళ్యాణం' చిత్రాలతో మంచి గుర్తింపు సంపాదించారు. అలాగే హిందీలో 'భాంగ్రా పాలే', 'జాదుగర్' చిత్రాల్లోనూ నటించారు. ఇటీవల 'నా సామిరంగా' చిత్రంలో కీలక పాత్రలో కనిపించిన రుక్సార్, కిరణ్ అబ్బవరం సరసన 'దిల్‌రుబా' సినిమాలోనూ ప్రేక్షకులను అలరించారు. వాణిజ్య చిత్రాలతో పాటు కథకు ప్రాధాన్యమున్న పాత్రలను ఎంపిక చేసుకుంటూ తన ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ప్రస్తుతం తెలుగు, పాన్‌ఇండియా స్థాయిలో రూపొందుతున్న పలు చిత్రాలతో బిజీగా ఉన్న రుక్సార్ ధిల్లాన్, దక్షిణాది చిత్రసీమలో తన స్థానాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా అడుగులు వేస్తున్నారు.




## పెళ్లికి పారిపోదామనుకున్నా..

### కీర్తి సురేష్ ఆసక్తికర వ్యాఖ్యలు

ప్రముఖ నటి కీర్తి సురేష్ తన ప్రేమ, వివాహం గురించి గతంలో చేసిన వ్యాఖ్యలు మరోసారి సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్నాయి. ప్రేమించిన వ్యక్తితో పెళ్లికి ఇంట్లో పెద్దలు ఒప్పుకోకపోతే ఇంటి నుంచి వెళ్లి వివాహం చేసుకోవాలని కూడా ఒక దశలో అనుకున్నానని ఆమె వెల్లడించారు.

తెలుగు, తమిళ చిత్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న కీర్తి సురేష్, హీరో రామ్ పోతినేని నటించిన 'నేను శైలజ' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమయ్యారు. అనంతరం 'మహానటి' చిత్రంతో విశేష గుర్తింపు పొందిన ఆమె, పలువురు అగ్ర హీరోల సరసన నటించారు. దీర్ఘకాలంగా ప్రేమలో ఉన్న ఆంటోనీ తట్టిల్‌ను కీర్తి సురేష్ 2024లో హిందూ, క్రైస్తవ సంప్రదాయాల ప్రకారం వివాహం చేసుకున్నారు. దాదాపు 15 సంవత్సరాల ప్రేమ తర్వాత వీరిద్దరూ ఒక్కటయ్యారు. ఒక ఇంటర్వ్యూలో కీర్తి మాట్లాడుతూ, తమ ప్రేమ విషయం ఇంట్లో చెబితే పెళ్లికి అంగీకరించరేమోనని మొదట భయపడ్డామని చెప్పారు. అవసరమైతే ఇంటి నుంచి వెళ్లి పెళ్లి చేసుకోవాలని కూడా అనుకున్నామని, అయితే కుటుంబ సభ్యులు తమ ప్రేమను అంగీకరించి ఘనంగా వివాహం జరిపించారని తెలిపారు.

తమ పెళ్లి ఇరు కుటుంబాల సమక్షంలో ఎంతో వైభవంగా జరుగుతుందని ఊహించలేదని, అందుకే వివాహ సమయంలో తాము ఇద్దరం భావోద్వేగానికి గురయ్యామని కీర్తి సురేష్ పేర్కొన్నారు. వివాహం అనంతరం కూడా కీర్తి సురేష్ సినీ రంగంలో చురుకుగా కొనసాగుతూ వరుస చిత్రాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు.



తెలంగాణ ముచ్చట్లు TELANGANA MUCHATLU

ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక




# తెలంగాణలో స్తంభించిన రిజిస్ట్రేషన్ సేవలు

- రెండో రోజూ పనిచేయని సర్వర్లు
- రాష్ట్రవ్యాప్తంగా నిలిచిన రిజిస్ట్రేషన్లు
- కార్యాలయాల వద్ద ప్రజల నిరీక్షణ

**హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ వ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో రిజిస్ట్రేషన్ సేవలు రెండో రోజూ పూర్తిగా స్తంభించాయి. ప్రధాన సర్వర్లలో తలెత్తిన సాంకేతిక లోపాల కారణంగా భూములు, ఇళ్లు, ఇతర స్థిరాస్తుల రిజిస్ట్రేషన్లు నిలిచిపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అన్ని జిల్లాల్లోని రిజిస్ట్రేషన్ కార్యాలయాల వద్ద క్రయ, విక్రయదారులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. సర్వర్లు పనిచేయకపోవడంతో కొత్త స్లాట్ బుకింగ్‌లు, చలాన్ చెల్లింపులు, ఈకేవైసీతో పాటు ఇతర ఆన్‌లైన్ సేవలు కూడా పూర్తిగా నిలిచిపోయాయి. ముందుగానే ముహూర్తాలు చూసుకుని స్లాట్‌లు బుక్ చేసుకున్న వారు సాక్షులతో కలిసి కార్యాలయాలకు చేరుకున్నప్పటికీ, రిజిస్ట్రేషన్ ప్రక్రియ ముందుకు సాగకపోవడంతో నిరాశకు గురయ్యారు.

గత మూడు నెలల్లో సాంకేతిక సమస్యల కారణంగా రిజిస్ట్రేషన్ సేవలు నిలిచిపోవడం ఇది నాలుగోసారి కావడం ప్రజల్లో అసంతృప్తిని పెంచుతోంది. తరచూ ఇలాంటి అంతరాయాలు ఏర్పడుతున్నప్పటికీ శాశ్వత పరిష్కారం చూపడంలో అధికారులు విఫలమవుతున్నారని డాక్యుమెంట్ రైటర్లు, ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సాంకేతిక లోపం ఎక్కడ తలెత్తిందనే విషయంపై క్షేత్రస్థాయి అధికారులకు కూడా స్పష్టమైన సమాచారం లేకపోవడంతో ప్రజలకు సరైన సమాధానం ఇవ్వలేకపోతున్నారు. దీంతో పలు రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో గందరగోళ పరిస్థితులు నెలకొన్నాయి. తమ పనులు ఎప్పుడు పూర్తవుతాయో తెలియక ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సాఫ్ట్‌వేర్‌లో ఏర్పడిన సమస్యను గుర్తించి సర్వర్లను పునరుద్ధరించేందుకు రాష్ట్రస్థాయి సాంకేతిక బృందం అత్యవసర చర్యలు చేపట్టిందని ఉన్నతాధికారులు తెలిపారు. సేవలను వీలైనంత త్వరగా పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. అయితే రిజిస్ట్రేషన్ సేవలు పూర్తిస్థాయిలో ఎప్పటి నుంచి అందుబాటులోకి వస్తాయనే అంశంపై ఇప్పటివరకు అధికారిక ప్రకటన వెలువడలేదు. దీంతో రిజిస్ట్రేషన్‌ల కోసం ఎదురుచూస్తున్న వేలాది మంది ప్రజలు, రియల్ ఎస్టేట్ రంగానికి చెందిన వారు ప్రభుత్వం త్వరితగతిన సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.



# రాజాసింగ్‌కు కోర్టులో ఊరట

- కేసును కొట్టివేసిన ప్రత్యేక కోర్టు
- సాక్ష్యాధారాలు లేవని స్పష్టీకరణ
- నిర్దోషిగా ప్రకటించిన న్యాయస్థానం

**హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):** గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్‌కు నాంపల్లి ప్రజాప్రతినిధుల ప్రత్యేక కోర్టు నుంచి కీలక ఊరట లభించింది. ఆయనపై నమోదైన కేసును పూర్తిగా కొట్టివేస్తూ కోర్టు మంగళవారం తుది తీర్పు వెలువరించింది. ఇరుపక్షాల వాదనలు, సమర్పించిన ఆధారాలను పరిశీలించిన అనంతరం ఆరోపణలను నిర్ధారించే తగిన సాక్ష్యాధారాలు లేవని పేర్కొంటూ రాజాసింగ్‌ను నిర్దోషిగా ప్రకటించింది. ఈ కేసు 2022 ఆగస్టులో హైదరాబాద్‌లో స్టాండప్ కమెడియన్ మునావర్ ఫారూఖీ ప్రదర్శనను వ్యతిరేకిస్తూ రాజాసింగ్ విడుదల చేసిన వీడియోకు సంబంధించినది. ఆ వీడియోలో ఆయన మత విద్వేషాలను రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు చేశారంటూ నగరంలోని పలు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదులు నమోదయ్యాయి. అనంతరం మంగళ్‌హాట్ పోలీసులు ఆయనపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

కేసు నమోదు అనంతరం 2022 ఆగస్టు 23న రాజాసింగ్‌ను పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే అరెస్ట్ ప్రక్రియలో చట్టపరమైన నిబంధనలు, ముఖ్యంగా సీఆర్‌పీసీ 41ఏ నోటీసు జారీ విధానాన్ని పాటించలేదని గుర్తించిన స్థానిక కోర్టు అప్పట్లో రిమాండ్‌ను తిరస్కరించి ఆయనను విడుదల చేసింది. అయితే అనంతరం నగరంలో చోటుచేసుకున్న నిరసనలు, శాంతిభద్రతల పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని హైదరాబాద్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు రాజాసింగ్‌పై నిర్బంధ చట్టం కింద చర్యలు తీసుకున్నారు. దీంతో ఆయన సుమారు 77 రోజుల పాటు జైలులో ఉన్నారు. అనంతరం న్యాయపరమైన ప్రక్రియల ద్వారా ఆయనకు బెయిల్ లభించింది.

ఈ కేసులో విచారణ కొనసాగిన అనంతరం ఇరుపక్షాల వాదనలు, సాక్ష్యాలను పరిశీలించిన ప్రత్యేక కోర్టు తుది తీర్పును వెలువరించింది. రాజాసింగ్‌పై చేసిన ఆరోపణలను నిర్ధారించే తగిన ఆధారాలు లేవని పేర్కొంటూ కేసును కొట్టివేసింది. ఈ తీర్పుతో రాజాసింగ్‌కు న్యాయపరంగా ఊరట లభించింది. అయితే ఈ కేసుకు సంబంధించిన ఇతర చట్టపరమైన అంశాలు లేదా అప్పీళ్లపై సంబంధిత పక్షాలు తీసుకునే నిర్ణయాల మేరకు తదుపరి పరిణామాలు ఉండే అవకాశం ఉంది.

# తెలంగాణలో భారీ పెట్టుబడులపై దృష్టి

- సీఎంతో సునీల్ భారతి మిత్తల్ భేటీ
- డేటా సెంటర్లు, కృత్రిమ మేధస్సుపై చర్చ
- హైదరాబాద్‌ను రెండో ప్రధాన కేంద్రంగా పరిశీలన

**హైదరాబాద్, జూన్ 30 (తెలంగాణ ముచ్చట్లు):**



ప్రముఖ పారిశ్రామికవేత్త, భారతి ఎంటర్‌ప్రైజెస్ చైర్మన్ సునీల్ భారతి మిత్తల్ మంగళవారం ఎంసీఆర్ హెచ్‌ఆర్‌డీ ఇన్‌స్టిట్యూట్‌లోని బోధి పావిలియన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిశారు. తెలంగాణలో పెట్టుబడుల విస్తరణ, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి, విద్యా రంగ సంస్కరణలు, భవిష్యత్ పారిశ్రామిక అవకాశాలపై ఇరువురు విస్తృతంగా చర్చించారు. పెట్టుబడిదారులకు అనుకూల విధానాలు, పారదర్శక పాలన, వేగవంతమైన సంస్కరణలతో తెలంగాణ దేశంలోనే అత్యంత ఆకర్షణీయమైన పెట్టుబడి గమ్యస్థానంగా నిలుస్తోందని ముఖ్యమంత్రి వివరించారు. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగంలో చేపడుతున్న సంస్కరణలను ముఖ్యమంత్రి వివరించారు. ప్రభుత్వ పాఠశాలల సమగ్ర ఆధునికీకరణ, యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీ ఏర్పాటు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా యువతకు నైపుణ్యాలు అందించడం, ఐటీఐలను అత్యాధునిక సాంకేతిక కేంద్రాలుగా తీర్చిదిద్దడం, పాలిటెక్నిక్ కళాశాలలను ఆధునికీకరించడం వంటి కార్యక్రమాలను ప్రస్తావించారు. పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలతో కూడిన మానవ వనరులను సిద్ధం చేయడంలో తెలంగాణ ముందంజలో ఉందని పేర్కొన్నారు.

డిజిటల్ మౌలిక వసతుల రంగంలో తెలంగాణను ప్రపంచ స్థాయి కేంద్రంగా తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో చందన్‌వెల్లి డేటా సెంటర్ ప్రాజెక్టును వేగంగా అమలు చేయాలని ముఖ్యమంత్రి కోరారు. అలాగే రాష్ట్రంలో భారీ స్థాయి సమీకృత డేటా సెంటర్, కృత్రిమ మేధస్సు మౌలిక వసతుల క్యాంపస్‌ను ఏర్పాటు చేసే అవకాశాలను పరిశీలించాలని భారతి ఎంటర్‌ప్రైజెస్‌ను ఆహ్వానించారు. హైదరాబాద్‌లో డిజిటల్ సేవలు, క్లౌడ్, సైబర్ భద్రత, కృత్రిమ మేధస్సు రంగాల్లో కార్యకలాపాలను మరింత విస్తరించాలని సూచించారు. భవిష్యత్ పెట్టుబడులకు సంబంధించిన అంశాల్లో ప్రభుత్వంతో సమన్వయం కోసం భారతి ఎంటర్‌ప్రైజెస్ తరపున ఒక సీనియర్ అధికారిని నియమించాలని ముఖ్యమంత్రి సూచించారు. పెట్టుబడుల అమలులో ఎదురయ్యే సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తుందని హామీ ఇచ్చారు. పరిశ్రమల అభివృద్ధి, ఉపాధి కల్పన, సాంకేతిక రంగాల విస్తరణకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు.

తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలను సునీల్ భారతి మిత్తల్ అభినందించారు. ప్రభుత్వ పాఠశాలలు, ఆధునిక సాంకేతిక కేంద్రాల్లో చదువుతున్న విద్యార్థులకు భారతి ఎయిర్‌టెల్ ఫౌండేషన్ ద్వారా స్కాలర్‌షిప్‌లు అందజేస్తామని ప్రకటించారు. హైదరాబాద్‌ను ఎయిర్‌టెల్ రెండో ప్రధాన కార్యాలయంగా పరిశీలిస్తున్నామని, తెలంగాణలో డేటా సెంటర్ల సామర్థ్యాన్ని మరింత పెంచడంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఫైబర్ కనెక్టివిటీని బలోపేతం చేసేందుకు సంస్థ కట్టుబడి ఉందని తెలిపారు. తెలంగాణలో సమాచార సాంకేతిక, డిజిటల్ మౌలిక వసతులు, కృత్రిమ మేధస్సు, విద్యా రంగాల్లో ప్రభుత్వపరిశ్రమల భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ పెట్టుబడులు రాష్ట్ర ఆర్థికాభివృద్ధితో పాటు యువతకు విస్తృత ఉపాధి అవకాశాలను కల్పిస్తాయని ఇరువర్గాలు అభిప్రాయపడ్డాయి. సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు కూడా పాల్గొన్నారు.

# నిశ్శబ్ద సమాజం... నిరాకరించబడుతున్న న్యాయం!

రాజ్యాంగం ఒక పవిత్ర గ్రంథం. చట్టం ఒక శక్తివంతమైన ఆయుధం. కానీ ఇక్కడ అసలైన విస్మయం కలిగించే ప్రశ్న ఏమిటంటే, ఆ ఆయుధాన్ని చేతుల్లోకి ఎవరు తీసుకుంటున్నారు? దానిని ఎవరి ప్రయోజనాల కోసం, ఎవరిపై ప్రయోగిస్తున్నారు? డెబ్బై ఏడేళ్ల సుదీర్ఘ స్వతంత్ర భారతదేశంలో వేలాది కొత్త చట్టాలు పుట్టుకొచ్చాయి, లక్షలాది లీగల్ సెక్షన్లు రూపుదిద్దుకున్నాయి, కోట్లాది పేజీల సుదీర్ఘ తీర్పులు న్యాయస్థానాల రికార్డు గదుల్లో దుమ్ము పట్టి పేరుకుపోయాయి. కానీ, నగ్న సత్యం ఏమిటంటే, నేటికీ ఒక సామాన్య పౌరుడు అత్యవసర స్థితిలో పోలీస్ స్టేషన్ గుమ్మం తొక్కాలంటే అతని గుండె ఎందుకు భయంతో వణుకుతుంది? తన హక్కుల రక్షణ కోసం ఒక న్యాయస్థానం తలుపు తట్టాలంటే ఒకటికి పదిసార్లు ఎందుకు ఆలోచించాల్సి వస్తోంది? ఈ సంక్లిష్ట సమాజంలో సమాధానం చాలా స్పష్టం, అత్యంత బాధాకరం. మన దేశంలో కాగితాలపై చట్టాలు పుష్కలంగా ఉన్నాయి, కానీ నిత్యజీవితంలో సామాన్యుడికి అందే నిజమైన న్యాయం మాత్రం ఎండమావిలా కొరవడింది.సాధారణ పరిభాషలో చట్టం అంటే ఒక క్రమశిక్షణ, సమాజం నడవడానికి నిర్మించిన ఒక చట్రం మాత్రమే. కానీ న్యాయం అంటే ఆ చట్రం పరిధిలో ప్రతి మనిషి గౌరవంగా, నిజాయితీగా, భయం లేకుండా జీవించగలిగే ప్రాథమిక హక్కు. ఈ రెండింటి మధ్య ఉన్న అగాధం నేడు ఆధునిక భారతదేశపు అతిపెద్ద సామాజిక విషాదంగా మారింది. ఒక బడా రాజకీయ నాయకుడో లేదా పారిశ్రామికవేత్తో వందల కోట్ల ప్రజాధనం కుంభకోణంలో అడ్డంగా ఇరుక్కున్నా, వారికి అపారమైన లీగల్ రక్షణ లభిస్తుంది, బెయిల్ క్షణాల వ్యవధిలో మంజూరవుతుంది. అదే సమయంలో, ఒక నిరుపేద రైతు తన చిన్న భూమి తగాదాలో చిక్కుకుంటే, అతని జీవితకాలమంతా కోర్టుల చుట్టూ, ఆ చల్లని అరుగుల మీదే కరిగిపోతుంది. తరతరాలు గడిచినా ఆ పేదవాడికి తీర్పు దక్కదు. ఇదేనా మన మహోన్నత రాజ్యాంగం దేశ పౌరులందరికీ వాగ్దానం చేసిన సామాజిక సమానత్వం? ఇదేనా చట్టం ముందు అందరూ సమానులే అంటూ మనం నిత్యం పఠించే ఆదర్శ సూత్రం? నేరం చేసిన వాడికి సమాజంలో ఆర్థిక బలం, రాజకీయ అండ ఉంటే చట్టంలోని లొసుగులను వాడుకుని సులభంగా తప్పించుకుంటాడు. కానీ అవేమీ లేని అమాయకుడికి ఇక్కడ న్యాయం దొరకదు సరేకదా, కనీసం అతని తరపున మాట్లాడే మంచి న్యాయవాది కూడా లభించడు. కోర్టు మెట్లు ఎక్కాలంటే జేబు నిండుగా డబ్బుండాలి, మనసులో అపారమైన ఓపిక ఉండాలి. ఇది ప్రజాస్వామ్య న్యాయవ్యవస్థా లేక ధనవంతుల కోసం నడిచే ప్రత్యేక కార్పొరేట్ వ్యవస్థా అని గట్టిగా ప్రశ్నించుకోవాల్సిన సమయం ఆసన్నమైంది.దేశాన్ని కుదిపేసిన నిర్భయ కేసు నుంచి నిన్నమొన్నటి హృదయ విదారక ఘటనల వరకు ఎన్నో దారుణాలు మన కళ్ళ ముందే నిరంతరం జరుగుతూనే ఉన్నాయి. ప్రతిసారీ ఘోరం జరిగినప్పుడు ఈ దేశం ఉద్వేగంతో కన్నీళ్లు పెట్టుకుంది, వీధుల్లోకి వచ్చి కొవ్వొత్తులు వెలిగించింది, గొంతు చించుకుని పెద్ద పెట్టున నినాదాలు చేసింది. కానీ ఆ తర్వాత ఏం జరుగుతోంది? మళ్ళీ అదే పాత నిశ్శబ్దం ఆవరిస్తుంది. మళ్ళీ అదే పాత నిర్లక్ష్యం రాజ్యమేలుతుంది. ఎందుకంటే మన వ్యవస్థలో న్యాయం వేగంగా అందదు. అది కాలయాపన చేస్తూ, వాయిదాల మీద వాయిదాలు వేస్తూ, చివరికి బాధితుడినే శారీరకంగా, మానసికంగా అలసిపోయేలా చేస్తుంది. న్యాయం ఆలస్యమైతే అది నిరాకరించినట్టే అనే అంతర్జాతీయ సూక్తి ఒకటుంది. దురదృష్టవశాత్తు మన దేశంలో ఈ సూక్తి నిత్యజీవితంలో ఒక చేదు వాస్తవంగా మారిపోయింది. స్థానిక పోలీసు స్టేషన్లలో సామాన్యుడి ఫిర్యాదు ఆధారంగా ఒక ఎఫ్ఐఆర్ నమోదు చేయించుకోవడమే నేడు ఒక పెద్ద యుద్ధంగా మారింది. డబ్బు, సామాజిక పలుకుబడి, రాజకీయ అండదండలు లేని వ్యక్తికి వ్యవస్థలో కనీస గౌరవం దక్కదు. కొన్ని సందర్భాల్లో బాధితుడు తనకు జరిగిన అన్యాయంపై న్యాయం కోసం వెళ్తే, ఎదురుగా ఉన్న శక్తుల ప్రభావం వల్ల అతడే నిందితుడిగా మారే విచిత్ర వైపరీత్యాలు మన కళ్ళ ముందే జరుగుతున్నాయి. ఇది కేవలం వ్యవస్థ యొక్క సంకేతిక వైఫల్యమా, లేక ఈ వ్యవస్థను నడుపుతున్న మనుషుల నైతిక పతనమా అనేది ప్రతి ఒక్కరూ ఆలోచించాలి.నేటి సమాజంలో న్యాయం అనేది ఒక సరుకుగా, వ్యాపార వస్తువుగా మారిపోయింది. ఒక వ్యక్తి ఎంత ఎక్కువ ఖర్చు పెట్టగలిగితే, అతనికి అంత మెరుగైన, అంత వేగవంతమైన న్యాయం మార్కెట్లో దొరుకుతుంది అన్నట్టుగా నేటి పరిస్థితులు తయారయ్యాయి. పేరుమోసిన పెద్ద లాయర్లు, వారు వసూలు చేసే భారీ ఫీజులు, తెరవెనుక నడిచే రాజకీయ పలుకుబడి ఇవి మూడూ కలిసి న్యాయస్థానాల తీర్పులను, కేసుల గమనాన్ని శాసిస్తున్నాయి. ఒక సాధారణ మధ్యతరగతి పౌరుడికి న్యాయవ్యవస్థ అంటేనే ఒక తెలియని భయం, బెదిరింపు, తీవ్ర నిస్సహాయత గుర్తుకొస్తాయి. ఇది ఒక ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అత్యంత ప్రమాదకరమైన సంకేతం. ఎందుకంటే ప్రజాస్వామ్యపు పునాది అనేది కేవలం ఓట్ల మీద కాదు, న్యాయవ్యవస్థపై ప్రజలకు ఉండే నిశ్చలమైన నమ్మకంపై ఆధారపడి ఉంటుంది. ఆ నమ్మకమే గనుక పూర్తిగా కుప్పకూలిపోతే, మన రాజ్యాంగం కేవలం అక్షరాలతో కూడిన ఒక నిర్జీవ కాగితంగా మిగిలిపోక తప్పదు.

> **వందల కోట్ల కుంభకోణం చేసిన వారికి క్షణాల్లో బెయిల్ వస్తుంది, కానీ పేద రైతు భూమి తగాదా కోసం జీవితకాలం కోర్టుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.**



ఈ విశ్లేషణ కేవలం ప్రభుత్వాన్ని లేదా పాలకులను నిందించే వ్యాసం కాదు. ఇది నిద్రాణమై ఉన్న ప్రతి పౌరుడి అంతరాత్మను ప్రశ్నించే ఒక సామాజిక పిలుపు. చట్టాలు తయారు చేసేది మన ప్రజా ప్రతినిధులే, వాటిని అమలు చేసేది ప్రభుత్వ అధికారులే కానీ అవి సరిగ్గా పని చేస్తున్నాయా లేదా అని నిలదీసి ప్రశ్నించాల్సిన ప్రాథమిక బాధ్యత మనపైనే ఉంది. మనం సమాజంలో జరిగే అన్యాయాలను చూస్తూ మౌనంగా ఉంటే, ఆ అన్యాయం మరింత బలపడి రేపు మనల్నే మింగేస్తుంది. ఎన్నికల సమయంలో ఓటు హక్కును కేవలం కొన్ని వందల రూపాయలకో, మద్యం సీసాలకో అమ్ముకుంటే, రేపు ఏదైనా విపత్తు వచ్చినప్పుడు లంచాలు లేని న్యాయం కోసం అధికారుల ముందు వేడుకోవాల్సి వస్తుంది. కేవలం తాత్కాలిక ప్రయోజనాల కోసం డబ్బుకు, కులానికి, మతానికి, ప్రాంతీయ పలుకుబడికి తలవంచితే, రేపటి తరానికి మనం ఇచ్చేది ఒక కుళ్లిన, అన్యాయపు సామాజిక వారసత్వాన్ని మాత్రమే. న్యాయవ్యవస్థలో సంస్కరణలు అనేవి ఒక్క రోజులో లేదా ఒక చట్టంతో వచ్చేవి కావు. కానీ ఆ మార్పు వైపు పడే మొదటి అడుగు నిలదీసి ప్రశ్నించడం నుంచే మొదలవుతుంది. ప్రతి పౌరుడు చట్టబద్ధంగా తనకున్న హక్కులను తెలుసుకోవాలి, తన గొంతును బలంగా వినిపించాలి, సమాజంలో ఎక్కడ అన్యాయం జరిగినా ఎదిరించే ధైర్యం చేయాలి. చట్టం ముందు అందరూ సమానులే అని కేవలం పాఠ్యపుస్తకాల్లో రాసుకుని సంతోషిస్తే సరిపోదు. ఆ సమానత్వం నిత్యం వీధుల్లో, పోలీసు స్టేషన్లలో, కోర్టు హాళ్లలో ప్రత్యక్షంగా కనిపించినప్పుడే దేశానికి నిజమైన స్వాతంత్ర్యం సిద్ధించినట్లు. మనకు రక్షణ కల్పించడానికి ఎన్నో చట్టాలు ఉన్నాయి, కానీ ఆ చట్టాల ద్వారా న్యాయం పొందడానికి మనమే స్వయంగా పోరాడాలి. సమూలంగా వ్యవస్థ మారాలంటే మొదట వ్యక్తుల ఆలోచనా విధానంలో మార్పు రావాలి. వ్యక్తులు మారాలంటే ప్రతి ఒక్కరూ సమాజంలో జరుగుతున్న విషయాలను నిశితంగా గమనిస్తూ, ప్రశ్నించడం నేర్చుకోవాలి. ఈ మహోన్నత దేశపు భవిష్యత్తు మరియు భద్రత కేవలం ఇక్కడి న్యాయవ్యవస్థ పటిష్టతపై ఆధారపడి ఉన్నాయి. ఆ న్యాయవ్యవస్థ యొక్క పారదర్శకత మన అందరి సామాజిక చైతన్యంపై ఆధారపడి ఉంటుంది. నిద్రపోతున్న సమాజం ఎప్పటికీ తన హక్కులను, న్యాయాన్ని పొందలేదు. మేల్కొన్న సమాజం మాత్రమే చరిత్రను తిరగరాసి, ఒక నూతన వ్యవస్థను నిర్మించగలదు. ఈ రోజు సమాజంలో జరుగుతున్న అన్యాయాలపై మనం మౌనంగా ఉంటే, రేపు మన పిల్లలు కూడా అదే అన్యాయపు కోరల్లో చిక్కుకుని నలిగిపోతారు. కాబట్టి ఇప్పుడే, ఈ క్షణమే గొంతు విప్పి ప్రశ్నించండి చట్టాలు ఎన్నో ఉన్నాయి, కానీ సామాన్యుడికి అందాల్సిన న్యాయం ఎక్కడ దాక్కుంది? ఆ సమాధానం కోసం వెతకాల్సింది మనమే, సమాజ హితం కోసం పోరాడాల్సింది మనమే, ఈ దుస్థితిని మార్చాల్సింది కూడా మనమే.

-డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

Printed,Published and Owned by RAJESH BOLLEPAKA,Printed at Amulya Publications and Printers Graphics,H.No:2-19/1,Thatikayala,Dharmasagar,Hanmakonda,506151 and Published at H.No:2-19/1,Thatikayala,Dharmasagar, Hanmakonda,506151.Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710.Contact:9493669669.Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in